# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 191 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | ఆదివారం 31 ఆగస్టు 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 191 31-08-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


## గోదావరికి వరద ఉధృతి

**భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక**

**కాటన్ బ్యారేజ్ వద్ద పెరుగుతున్న ప్రవాహం**

రాజమహేంద్రవరం, ఆగస్టు 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఎగువన కురుస్తున్న వర్షాలతో గోదావరికి వరద ఉధృతి క్రమంగా పెరుగుతుంది. ప్రస్తుతం భద్రాచలం వద్ద 47 అడుగుల నీటిమట్టం




- మిగతా 2లో..

# 'అగ్రసీమ'గా రాయలసీమ

- ఇందుకు బ్లూప్రింట్ సిద్ధం
- కుప్పానికి ఇప్పుడు నీళ్లచ్చాయి.. వచ్చే ఏడాది చిత్తూరుకూ ఇస్తాం
- బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- 'పరమసముద్రం'లో జలహారతి

కుప్పం ఆగస్టు 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాయలసీమను అగ్రసీమగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. రాయలు ఏలిన కాలంలో రతనాల సీమగా ఉన్న ఈ ప్రాంతం వరుస కరువుతో రాళ్లసీమగా మారిందని, తమ ప్రభుత్వం రాయలసీమ అభివృద్ధికి కృతనిశ్చయంతో పనిచేస్తోందని అన్నారు. ఇందుకు బ్లూప్రింట్ సిద్ధంగా ఉందని తెలిపారు. కర్నూలు జిల్లా మన్యాల నుంచి 738 కిలోమీటర్ల దూరం కృష్ణా జలాలను తీసుకొచ్చామన్నారు. కుప్పం నియోజకవర్గం పరమసముద్రం గ్రామంలో హంద్రీనీవా బ్రాంచి కెనాల్ వద్ద కృష్ణా జలాలకు ముఖ్యమంత్రి జలహారతి ఇచ్చారు. హంద్రీనీవా కాల్వ విస్తరణ పనుల పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆరు పరిశ్రమలకు సంబంధించి ఎంఒయులు కుదుర్చుకున్నారు. చంద్రబాబు మాట్లాడుతూ ఇప్పటివరకూ 12 పరిశ్రమలు వచ్చాయని, రూ.3,908 కోట్ల పెట్టుబడులు పెట్టారని, 15,600 మందికి ఉద్యోగాలు, 26,581 మందికి పరోక్ష ఉపాధి లభిస్తుందని తెలిపారు. 2024 ఎన్నికల్లో సీమ ప్రజలు వైసిపికి ఏడు సీట్లకే





సరిపెట్టారని, తమను ఆదరించిన సీమ ప్రజల అభివృద్ధే ధ్యేయంగా టిడిపి కూటమి ప్రభుత్వం కంకణబద్ధమై ఉందన్నారు. రాయలసీమలో ఇరిగేషన్, హార్టికల్చర్, అగ్రికల్చర్, పరిశ్రమలకు పెద్దపీట వేస్తూ అగ్రసీమగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఒకప్పుడు రాయలసీమలో కరువు వస్తే పశువుల కోసం రైళ్లలో నీళ్లు తెప్పించి కాపాడుకున్నామని, తాను

- తరువాయి 2లో..



## కుప్పంలో కృష్ణమ్మకు చంద్రబాబు జల హారతి

కుప్పం ఆగస్టు 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



కుప్పం బ్రాంచ్ కెనాల్ వద్ద కృష్ణమ్మకు సిఎం చంద్రబాబు జలహారతినిచ్చారు. శనివారం చిత్తూరు జిల్లా కుప్పంలో ముఖ్యమంత్రి పర్యటించారు. హంద్రీ-నీవా కాల్వల విస్తరణ పనుల ద్వారా కుప్పం చివరి భూములకు కృష్ణా జలాలు చేరాయి. శ్రీశైలం నుంచి 738 కిలో మీటర్లు ప్రయాణించిన కృష్ణమ్మ కుప్పంకు చేరింది. ఈ సందర్భంగా కృష్ణమ్మకు ముఖ్యమంత్రి

- తరువాయి 2లో..

# సీఎం బోటు షికారు..



- కుప్పానికి తొలిసారిగా చేరిన హంద్రీ-నీవా కృష్ణా జలాలు
- పరమసముద్రం చెరువు వద్ద సంబరాల్లో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- బోటులో చెరువును పరిశీలించి
- ప్రజలకు అభివాదం చేసిన ముఖ్యమంత్రి
- నియోజకవర్గంలోని 66 చెరువులకు అందనున్న సాగునీరు
- సుమారు 3,200 ఎకరాల ఆయకట్టుకు ప్రయోజనం

కుప్పం ఆగస్టు 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

దశాబ్దాలుగా కుప్పం ప్రజలు ఎదురుచూస్తున్న కల నెరవేరింది. కరవు నేలగా పేరుపడ్డ ఈ ప్రాంతానికి హంద్రీ-నీవా ద్వారా కృష్ణా జలాలు తొలిసారిగా తరలిరావడంతో నియోజకవర్గమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఈ చారిత్రక ఘట్టాన్ని పురస్కరించుకుని సీఎం చంద్రబాబు కుప్పంలో పర్యటించి, ప్రజల ఆనందంలో పాలుపంచుకున్నారు. శనివారం కుప్పం చేరుకున్న ముఖ్యమంత్రి, నియోజకవర్గంలోని చివరి భూములకు నీరందించే పరమసముద్రం చెరువు వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. అంతకుముందు, కృష్ణా జలాలతో నిండుకుండలా మారిన చెరువును స్థానికుల కోరిక మేరకు ఆయన బోటులో ప్రయాణించి పరిశీలించారు. బోటులో ప్రయాణిస్తూ, ఒడ్డున ఉన్న ప్రజలకు అభివాదం చేశారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. హంద్రీ-నీవా జలాల రాకతో కుప్పం నియోజకవర్గంలోని 66 చెరువులను నింపనున్నారు. దీనివల్ల సుమారు 3,200 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది. గత మూడు నాలుగు రోజులుగా కాల్వల ద్వారా వస్తున్న కృష్ణమ్మ నీటిని చూసి స్థానిక ప్రజలు, రైతులు ఆనందంతో ఉప్పొంగిపోతున్నారు.

- తరువాయి 2లో..






## అందరికీ ఏజ్ పెరిగితే బాలయ్యకు క్రేజ్ పెరుగుతోంది..

**ఏ రంగంలోనైనా నెంబర్ వన్!: మంత్రి నారా లోకేశ్**

- హీరోగా 50 ఏళ్లు పూర్తి
- వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందిన నందమూరి బాలకృష్ణ
- హైదరాబాద్‌లో ఘనంగా కార్యక్రమం
- చరిత్ర సృష్టించడం బాలయ్యకే సాధ్యమన్న మంత్రి నారా లోకేష్
- పాల్గొన్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, సినీనటి జయసుధ, ఇతర ప్రముఖులు

3 లో..

చరిత్ర సృష్టించాలన్నా, చరిత్ర తిరగరాయాలన్నా హీరో నందమూరి బాలకృష్ణ వలనే సాధ్యమవుతుందని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఇటీవల వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం సంపాదించిన బాలకృష్ణకు హైదరాబాద్ లోని ఒక హెటల్ లో పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, బాలయ్యను వేనోళ్ల కొనియాడారు.





## చైనాలో మోదీకి ఘన స్వాగతం..

- 'వందేమాతరం' నినాదాలతో హెూరెత్తిన విమానాశ్రయం
- షాంఘై సదస్సు కోసం చైనాలోని టియాంజిన్‌కు చేరుకున్న ప్రధాని మోదీ
- విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం పలికిన ప్రవాస భారతీయులు
- 'వందేమాతరం', 'భారత్ మాతా కీ జై' నినాదాలతో మార్మోగిన పరిసరాలు
- ఆదివారం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో మోదీ భేటీ
- సోమవారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో కీలక సమావేశం
- సరిహద్దు ఉద్రిక్తతల తర్వాత జిన్‌పింగ్‌తో భేటీకి పెరిగిన ప్రాధాన్యం

షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు చైనాకు చేరుకున్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఘన స్వాగతం లభించింది. శనివారం సాయంత్రం టియాంజిన్‌లోని బిన్హాయ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు అక్కడ నివసిస్తున్న ప్రవాస భారతీయులు బ్రహ్మరథం పట్టారు. భారతీయ సంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఆయన్ను ఆహ్వానించారు. 'వందేమాతరం', 'భారత్ మాతా కీ జై' అంటూ దేశభక్తి నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. జపాన్ పర్యటన ముగించుకుని నేరుగా చైనాకు వచ్చిన ప్రధానమంత్రి మోదీ, ప్రవాస భారతీయుల ఆత్మీయ స్వాగతంపై సంతోషం వ్యక్తం చేశారు. "చైనాలోని భారత

- తరువాయి 2లో..

**బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై**

## తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు

- రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం
- రిజర్వేషన్లపై గత ప్రభుత్వం విధించిన పరిమితిని ఎత్తివేస్తూ జీవో జారీ చేయాలని నిర్ణయం
- కోదండరామ్, అజారుద్దీన్‌లను ఎమ్మెల్సీలుగా ఎంపిక చేయాలని కేబినెట్ నిర్ణయం



హైదరాబాద్ ఆగస్టు 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై తెలంగాణ మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. పంచాయతీల్లో రిజర్వేషన్‌పై గత ప్రభుత్వం విధించిన పరిమితిని ఎత్తివేస్తూ జీవో జారీ చేయాలని నిర్ణయించింది. దీని ఆధారంగా ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ మంత్రివర్గం సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అజారుద్దీన్‌లను ఎంపిక చేయాలని తెలంగాణ కేబినెట్ నిర్ణయించింది. గతంలో అమీర్ ఖాన్‌కు అవకాశం ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఈసారి ఆయన స్థానంలో అజారుద్దీన్‌కు అవకాశం ఇచ్చింది. ఈ మేరకు కోదండరామ్, అజారుద్దీన్‌ల పేర్లను సిఫార్సు చేస్తూ గవర్నర్‌కు పంపించింది.

## 'ఉక్కు'లో ఇఒఐలకు వ్యతిరేకం కాదు

**టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా**

**ఈ ప్రకటనపై కార్మిక సంఘాల ఆగ్రహం**



విశాఖపట్నం ఆగస్టు 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లోని విభాగాలను ప్రైవేటుకు అప్పగించేందుకు ప్లాంట్ యాజమాన్యం ప్రకటించిన ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్ (ఇఒఐ)లకు తమ ప్రభుత్వం వ్యతిరేకం కాదని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. గాజువాకలోని

- తరువాయి 2లో..

## విభిన్న ప్రతిభావంతుల సమస్యలను కేబినెట్‌లో చర్చిస్తాం : పవన్ కల్యాణ్

- విశాఖలో ఉప ముఖ్యమంత్రి పవన్‌ను కలిసిన దివ్యాంగులు
- తమ సమస్యలపై వినతిపత్రం అందజేత
- జీవో నంబర్ 2 సవరణ, వ్యక్తిగత రేషన్ కార్డుల మంజూరుపై విజ్ఞప్తి
- సమస్యలను కేబినెట్‌లో చర్చిస్తానని పవన్ హామీ
- ఆటో డ్రైవర్ల సమస్యలపైనా డిప్యూటీ సీఎంకు వినతి
- స్త్రీ శక్తి పథకంతో తగ్గిన ఆదాయంపై ఆటో డ్రైవర్ల ఆవేదన

విశాఖపట్నం ఆగస్టు 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించారు. విశాఖపట్నం పర్యటనలో భాగంగా తనను కలిసిన విభిన్న ప్రతిభావంతులు, ఆటో డ్రైవర్ల నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలను మంత్రివర్గ సమావేశంలో చర్చించి, పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు. శనివారం నాడు విశాఖలో విజువల్లీ ఛాలెంజ్డ్ యూత్ అసోసియేషన్ సభ్యులు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిసి తమ ఇబ్బందులను విన్నవించారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 2ను సవరించి, రోస్టర్

- తరువాయి 2లో..



https://epaper.teluguraastram.com

తెలుగురాష్ట్రం దినపత్రిక

# సంపాదకీయం

## రుతుపవనాల విధ్వంసం ఆపలేమా?

ఉత్తరాది రాష్ట్రాలు జలప్రళయంతో విలవిల్లాడుతున్నాయి. ఉత్తరాఖండ్‌లోని రుద్రప్రయాగ్, చమోలీ జిల్లాల్లో కుంభవృష్టి అనేక గ్రామాలను ముంచెత్తుతోంది. ఉత్తరాఖండ్‌లో తాజాగా మరోసారి క్లౌడ్‌బర్స్ట్ సభవించింది. అనేక చోట్ల ఇళ్లుకూలి అనేకమంది ప్రాణాలు కోల్పోయారు. హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్ రాష్ట్రాల్లో అనేక జిల్లాలకు సంబంధాలు తెగిపోయాయి. జమ్మూకశ్మీర్‌లో ఇప్పటివరకు 40 మంది ప్రాణాలు కోల్పోయారు. శ్రీనగర్, అనంత్‌నాగ్‌ల్లో నదులు ప్రమాదస్థాయిని మించి ఉప్పొంగడంతో, గండ్లుపడి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంజాబ్‌లో గ్రామాలన్నీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వ్యవసాయ భూములు అదృశ్యమయ్యాయి. దేశ రాజధాని ఢిల్లీలో కూడా భారీ వర్షపాతం నమోదైంది.

యమునా నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. నైరుతి పవనాల ప్రభావం తీవ్రంగా ఉంటోంది. ఆగస్టులో మేఘ విస్ఫోటంతోనే వర్షాలు ప్రారంభమయ్యాయి. హిమాలయ పర్వత వాలు ప్రాంతాలు ఒరిగిపోయాయి. మైదానప్రాంతాల్లో గట్లు దెబ్బతిన్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తక్కువ సమయాల్లో ఎడతెరిపిలేని కుంభవృష్టి స్థానిక నేలకోతను పెంచుతుంది. కొండచరియలు విరిగిపడి సమీప నివాసాలను ధ్వంసం చేస్తున్నాయి. ఇలాంటి సందర్భాల్లో ఉపశమనం అనేది కేవలం ప్రతిచర్యాత్మక చర్యలకే పరిమితం కాకూడదు. కేంద్రీకృత జ్ఞానం అవసరం. విధ్వంసకర వర్షపాతం ఇప్పుడుపునరావృతమయ్యే ప్రమాదం ఉంది. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నివారణ వ్యూహాల కోసం అధికంగా ఖర్చు చేయడం తప్పనిసరి.

అటువంటి చర్యలను అమలు చేయలేని అత్యవసర పరిస్థితులుగా పరిగణించే వైఖరిని కొనసాగించడమంటే ఇప్పటికే అందుబాటులో ఉన్న ఆధారాలను తిరస్కరించడమే అవుతుంది. గత ప్రకృతి వైపరీత్యాల అనుభవాల నుంచి నేర్చుకున్నప్పటికీ వాటిని విస్మరించి ప్రతి విపత్తును అసాధారణమైనదిగా పరిగణించడం పరిపాటవుతోంది. కొండచరియలు విరిగి పడడానికి 51% అనువైన ప్రాంతం ఉత్తరాఖండ్ అని వాడియా ఇన్‌స్టిట్యూట్ అధ్యయనంలో తేలింది. పర్యావరణ సున్నిత ప్రాంతాలపై జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధ్యయనంలో దేశంలోని 16 రాష్ట్రాలు, హిమాలయ రీజియన్ లోని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు, ఈశాన్యంలోని హిమాలయ పర్వత దిగువ భాగాలు, పశ్చిమ కనుమలు ఇవన్నీ కొండచరియలు విరిగిపడే ప్రాంతాలుగా గుర్తించింది రోడ్లు, రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలు, ఎలాంటి ప్రణాళిక లేకుండా సాగించే కొండ క్వారీ పనులు కొండచరియలు విరిగిపడడానికి కారణమవుతున్నాయని హెచ్చరించింది. హిమాలయ పర్వత ప్రాంతాల్లో 2015 నుంచి 2018 మధ్యకాలంలో 10.76 మిలియన్ చెట్లను కూల్చివేశారు. ఆ లోటు భర్తీ ఇప్పటికీ కాలేదు. దీంతో కొండలపై ఉన్న సారవంతమైన మట్టి వర్షాలకు కొట్టుకుపోయి, కొండచరియలు వదులవుతున్నాయి. దీంతోపాటు పంట పొలాల్లోకి, ఇళ్లలోకి బురద ప్రవాహంలా వచ్చిచేరుతోంది. ఎన్నో ప్రాణాలు జలసమాధి అవుతున్నాయి. ఇవన్నీ స్వయం కృతాపరాధాలే. పర్యావరణ సున్నితమైన హిమాలయ రాష్ట్రాల్లో కొండవాలు ప్రాంతాలు అత్యంత బలహీనమైనవని, వాటిని తిరిగి పొందలేమని ఎన్ని హెచ్చరికలు పర్యావరణ శాస్త్రవేత్తలు చేసినా అటవీ నిర్మూలన, రోడ్ల వెడల్పు నిర్మాణాలు చేపట్టడం జరుగుతోంది.

కొండవాలు ప్రాంతాలను బలహీనం చేస్తున్నారు. దీంతో పరీవాహక సామర్థ్యం కుదించుకుపోయి ఆనకట్టల్లో పూడిక పేరుకుపోతోంది. వరదలతో దిగువ ప్రవాహాలు పెరుగుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు అదే పనిగా సంభవిస్తున్నా ముందస్తు హెచ్చరికలు, పల్లపు ప్రాంతాలను ఖాళీ చేయించడం వంటి వ్యవస్థలు ఇంకా సరిగ్గా అభివృద్ధి చెందలేదు. ఈ హెచ్చరికలు క్షేత్రస్థాయిలో ప్రజలకు సరిగ్గా అందడం లేదు. నష్టం సంభవించినప్పుడు రిలీఫ్ ఏజెన్సీలు స్పందిస్తుంటాయి. కానీ ఒక క్రమపద్ధతిలో చర్యలు చేపట్టడం కానీ, ముందుగా అవసరమైన సరఫరాలు సిద్ధం చేయడం కానీ, సామాజక పరంగా సన్నాహాలు కానీ లోపభూయిష్టంగా ఉంటున్నాయి. వాతావరణాన్ని తట్టుకునే మౌలిక సదుపాయాల గురించి ఆలోచించకుండా రాష్ట్రాలు, కేంద్రం అత్యవసరంగా రోడ్డు నిర్మాణాలను, నగరాల విస్తీకరణాన్ని చేపడుతున్నాయి. ఇతర అవసరాల కోసం అడవులను నరికివేస్తున్నారు. మళ్లీ ఆ లోటు భర్తీగా కొత్తగా అడవుల పెంపకాన్ని చేపట్టడం లేదు. పునరావాస చర్యలు కొద్దిగా ఉంటున్నాయి. కొండవాలు ప్రాంతాలను తొలగించడం, పరీవాహక ప్రాంతం కుదించుకుపోవడం, జనాభా పెరిగిపోతుండడం వీటన్నిటి ఫలితం ఎంతటి విధ్వంసాన్ని కలిగిస్తుందో ప్రత్యక్షంగా చూస్తున్నాం. సుస్థిర సౌకర్యాలు సమకూర్చనిదే పునరావాస చర్యలు ఎంత చేపట్టినా, బడ్జెట్ నిధులు ఎంత ఖర్చు చేసినా ఈ సమస్యల పరిష్కారం కాదు. కొండచరియలు విరిగిపడే ప్రమాదాన్ని నివారించగలగాలి. ముందస్తు హెచ్చరికలు తక్షణం ప్రజలకు అందేలా చూడాలి. వచ్చే రుతుపవనాలు కూడా ఇలాంటి విధ్వంసాలనే కలిగించవచ్చు. పునరావాస చర్యలు కల్పించామని సంతృప్తి పడరాదు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఒక ప్రణాళికతో దౌర్బల్యాలను తగ్గించుకోవడం మన బాధ్యత. అసాధారణ వైపరీత్యాల వల్ల గత 31 సంవత్సరాలుగా మొత్తం 3.8 ట్రిలియన్ డాలర్ల వరకు నష్టాలు ఏర్పడినట్టు తేలింది. సరాసరిన ఏటా 123 బిలియన్ డాలర్ల వరకు నష్టాలు సంభవించాయని స్పష్టమవుతోంది. ప్రకృతి వైపరీత్యాలతో ప్రాణనష్టం, ఆస్తుల నష్టం జరిగినప్పుడు బాధపడడం తప్ప తరచుగా సంభవిస్తున్న ఈ విపత్తుల నివారణకు ముందస్తు ప్రణాళికలు ఏ విధంగా అమలు చేయాలని ప్రభుత్వాలు ఆలోచించడం లేదు.

## ‘అగ్రసీమ’గా రాయలసీమ

ఏ పనిచేయాలన్నా వెంకన్నపై భారం వేసి బుల్లెట్‌లా దూసుకెళతానని, పవిత్రమైన సంకల్పం ఉంటే జయప్రదమవుతుందని అన్నారు. 2014-19లో రాయలసీమ ప్రాజెక్టులకు 12,500 కోట్లు ఖర్చు చేశామని, వైసిపి పాలనలో కేవలం రెండు వేల కోట్లు ఖర్చు చేశారని వివరించారు. గేట్లతో సెట్టింగ్ వేసి నీళ్లు కూడా బయట నుంచి తీసుకొచ్చి నాటకాలాడిన ఘటనలు, విమానం ఎక్కేలోపే నీళ్లన్నీ ఇంకిపోయిన పరిస్థితులను చూశామని అన్నారు. అసత్యాలు చెప్పడంలో వైసిపి దిట్టని విమర్శించారు. ప్రతి చెరువుకూ నీళ్లిచ్చే బాధ్యత తనదని, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో 110 చెరువులకు నీళ్లిచ్చే అవకాశం ఉందని అన్నారు. హంద్రీనీవా ఫేజ్-1, ఫేజ్-2 వల్ల ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు వస్తుందని, 33 లక్షల మందికి తాగునీరు అందుబాటులో ఉంటుందని తెలిపారు. పరిశ్రమలకూ నీళ్లిస్తామన్నారు. కర్నూలులో కృష్ణగిరి, పత్తికొండ రిజర్వాయర్లకు, అనంతపురంలో జీడిపల్లి రిజర్వాయర్‌కు, పెన్నాఅహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు నాలుగు టిఎంసిల నీళ్లు నింపామన్నారు. ఇవాళ కుప్పానికి నీళ్లొచ్చాయని, రాబోయే ఏడాదికి హంద్రీనీవా ద్వారా చిత్తూరుకూ నీళ్లిచ్చే బాధ్యత తనదని ప్రకటించారు. పోలవరం, బనకచర్ల పూర్తయి వంశధార నుంచి పెన్నా నది వరకూ అనుసంధానం చేయగలిగితే కరువు అనేది ఉండదన్నారు. నదుల అనుసంధానం ఉపయోగాన్ని తెలంగాణా నేతలు తెలుసుకోవాలని సూచించారు. వైసిపి విషవృక్షంగా తయారైందని, ఏ మంచి పని చేస్తున్నా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. 2027 నాటికి పోలవరం పూర్తి చేస్తామన్నారు. రాష్ట్రంలో రోడ్లు, ఎయిర్ పోర్టులకు ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు.

**‘స్త్రీశక్తి’ వల్ల ఆటో డ్రైవర్లకు నష్టం రాదు**

జలహారతికి హాజరైన చంద్రబాబు కుప్పం బ్రాంచి కెనాల్ వరకూ ‘స్త్రీశక్తి’ బస్సు ఎక్కి సందడి చేశారు. మహిళలు, రైతులతో సంభాషించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీశక్తి పథకం వల్ల ఆటో డ్రైవర్లకు ఎలాంటి నష్టమూ రాదన్నారు. ఆటో డ్రైవర్ల సంక్షేమం గురించి ఆలోచన చేస్తున్నామని తెలిపారు. మేనిఫెస్టోలో చెప్పిన అంశాలను అమలు చేసి ఆదుకుంటామన్నారు. మెగా డిఎస్సి ద్వారా టీచర్ పోస్టులు భర్తీ చేస్తున్నామని, కుప్పం నుంచి 50 మంది టీచర్లు ఎంపికయ్యారని తెలిపారు. కుప్పం నియోజకవర్గానికి ఒకప్పుడు టీచర్లే వచ్చేవారు కాదని, ట్రాన్స్‌ఫర్లు చేయించుకుని వెళ్లిపోయేవారని, ఇప్పుడు కుప్పం యువతీయువకులే టీచర్లయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంఎల్‌సి శ్రీకాంత్, పలమనేరు ఎంఎల్ఎ అమరనాథరెడ్డి తదితరులు పాల్గన్నారు.

**వైసీపీ హయాంలో నీటితో డ్రామాలు**

దివంగత ఎన్టీఆర్ సంకల్పించిన రాయలసీమ సస్యశ్యామల స్వప్నాన్ని తాము నిజం చేస్తున్నామని చంద్రబాబు అన్నారు. “సీమలో పశువుల దాహం తీర్చడానికి రైళ్లలో నీళ్లు తెప్పించిన దుస్థితిని నేను చూశాను. అందుకే 1999లోనే హంద్రీ-నీవాకు శ్రీకారం చుట్టాను. 2014-19 మధ్య మా ప్రభుత్వ హయాంలో సీమ సాగునీటి ప్రాజెక్టులపై రూ. 12,441 కోట్లు ఖర్చు చేస్తే, గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కేవలం రూ. 2 వేల కోట్లు మాత్రమే వెచ్చించి చేతులు దులుపుకుంది. ఎన్నికల ముందు గేట్లకు రంగులేసి, బయటి నుంచి నీళ్లు తెచ్చి వదిలి డ్రామాల ఆడారు. వారు విమానం ఎక్కేలోపే ఆ నీళ్లు ఇంకిపోయాయి. అబద్ధాలు చెప్పడంలో వైసీపీ, అసాధ్యాలను సుసాధ్యం చేయడంలో ఎన్డీఏ దిట్ట” అని ఎద్దేవా చేశారు.

**సీమలో కరవును తరిమికొడతాం**

నీటి విలువ తెలిసిన పార్టీ తెలుగుదేశం అని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రూ. 3,850 కోట్లు మంజూరు చేసి, కాలువల విస్తరణ పనులు పూర్తి చేసిందని చంద్రబాబు వివరించారు. “నాలుగు నెలల్లోనే 40 టీఎంసీల నీటిని తీసుకొచ్చి, పది రిజర్వాయర్లను నింపాం. దీనివల్ల సీమలోని 6 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీరు అందుతుంది. వచ్చే ఏడాదికల్లా చిత్తూరు జిల్లాలోని పీలేరు, పుంగనూరు, చంద్రగిరి వంటి చివరి నియోజకవర్గాలకూ నీరందిస్తాం. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు ద్వారా వంశధార-పెన్నా నదులను అనుసంధానిస్తే రాయలసీమలోనే కాదు, రెండు తెలుగు రాష్ట్రాల్లో కరవు అనే మాటే వినిపించదు. ఈ విషయాన్ని తెలంగాణ నేతలు కూడా అర్థం చేసుకోవాలి” అని ఆయన పిలుపునిచ్చారు. ‘రప్పా రప్పా’ రాజకీయాలు కుదరవని, మొన్నటి ఎన్నికల్లో పులివెందుల ప్రజలే దానికి సమాధానం చెప్పారని చురకలంటించారు. ‘స్త్రీ శక్తి’ పథకం వల్ల ఇబ్బందులు పడుతున్న ఆటో డ్రైవర్లను అన్ని విధాలా ఆదుకుంటామని, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు వారికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. కుప్పంలో హిందాల్కో వంటి 12 పరిశ్రమల రాకతో వేలమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ప్రపంచంలోని అత్యుత్తమ టెక్నాలజీని కుప్పానికి తీసుకొస్తానని హామీ ఇచ్చారు. మెగా డీఎస్సీ, పెన్షన్ల పెంపు, అన్న క్యాంటీన్లు, దీపం పథకం వంటి హామీలను నెరవేరుస్తూ ప్రజారంజక పాలన అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, చిత్తూరు జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## కుప్పంలో కృష్ణమ్మకు చంద్రబాబు జల హారతి




చంద్రబాబు జలహారతినిచ్చారు. వేద మంత్రోచ్చారణల మధ్య కృష్ణమ్మకు పసుపు, కుంకమ సమర్పించి జలహారతి ఇచ్చారు. ఈ జలహారతి కార్యక్రమంలో మంత్రి నిమ్మల, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కుప్పం స్థానిక టిడిపి నేతలు, ప్రజలు పాల్గొన్నారు. కృష్ణా జలాలకు హారతి ఇవ్వడానికి ముందు కాలువ ఒడ్డున పైలాన్ ప్రారంభించారు. కుప్పం బ్రాంచ్ కెనాల్ వద్ద ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు సందర్శించారు. మల్యాల ఎత్తిపోతల నుంచి కృష్ణా జలాలు కుప్పానికి చేరుకున్న తీరును వివరిస్తూ ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. మధ్యలో రిజర్వాయర్లను, చెరువులను ఏ స్థాయిలో నింపామనే విషయాన్ని సిఎంకు మంత్రి నిమ్మల, ఇరిగేషన్ అధికారులు వివరించారు. హంద్రీ-నీవా ద్వారా కుప్పం వరకు నీరు చేరిన విధానాన్ని వివరిస్తూ ప్రదర్శించిన మ్యాపులను చంద్రబాబు పరిశీలించారు. రిజర్వాయర్లల్లో నీరు ఏ విధంగా నింపుతున్నాం.. ప్రవాహాలు వస్తున్న తీరును జనానికి అర్థమయ్యేలా సీసీ కెమెరాల ద్వారా లైవ్ లో చూపించే ఏర్పాట్లు చేయాలని సిఎం ఆదేశించారు. నీటి విలువ, ఇరిగేషన్ కోసం ఎంత ఖర్చు పెడుతున్నామనే అంశాలను, ఎన్ని రోజుల్లో నీటిని తరలించామనే విషయాలను వివరిస్తూ లైవ్ డెమానిస్ట్రేషన్ ఇవ్వాలని సిఎం సూచించారు. చిన్నారులకు, యువతకు నీటి విలువ, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై అవగాహన పెంచడంతోపాటు.. చరిత్ర కూడా తెలియచెప్పాల్సిన అవసరం ఉందని సిఎం చంద్రబాబు తెలిపారు. కాసేపట్లో బహిరంగ సభలో సిఎం పాల్గొని ప్రసంగించనున్నారు. అనంతరం వివిధ కంపెనీల ప్రతినిధులతో ఎంవోయూలు అక్కడికి చేసుకోనున్నారు. ఈరోజు సాయంత్రం కుప్పం పర్యటనను ముగించుకొని బెంగుళూరు



విమానాశ్రయానికి సిఎం చంద్రబాబు బయలుదేరి వెళ్లనున్నారు.

## సీఎం బోటు షికారు..



నీటిలో తడుస్తూ, కృష్ణా జలాలకు స్వాగతం పలుకుతూ సంబరాలు చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా, గత ప్రభుత్వం డమ్మీ గేట్లు పెట్టి తమను మోసం చేసిందని కొందరు స్థానికులు గుర్తుచేసుకున్నారు. సభా ప్రాంగణంలో 1989 నుంచి కుప్పంలో వ్యవసాయం, సాగునీరు, పారిశ్రామిక రంగాల్లో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ అధికారులు రూపొందించిన ప్రత్యేక వీడియోను ప్రదర్శించారు. కుప్పం నీటి కష్టాలు ఎలా తీరాయో ఈ వీడియోలో వివరించారు. ముఖ్యమంత్రి పర్యటనతో కుప్పంలో సందడి వాతావరణం నెలకొంది.

## చైనాలో మోదీకి ఘన స్వాగతం..

సమాజం టియాంజిన్‌లో ఎంతో ప్రత్యేకమైన స్వాగతం పలికింది” అని ఆయన సామాజిక మాధ్యమం ‘ఎక్స్’ ద్వారా తెలియజేశారు. ఎస్‌సీవో సదస్సులో భాగంగా వివిధ దేశాల అధినేతలతో లోతైన చర్చలు జరపనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆదివారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో ప్రధానమంత్రి మోదీ కీలక ప్రసంగం చేయనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన పలువురు ప్రపంచ నేతలతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించనున్నారు. ముఖ్యంగా ఆదివారం నాడు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో, సోమవారం నాడు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధానమంత్రి మోదీ సమావేశం కానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

## ‘ఉక్కు’లో ఇఒఐలకు వ్యతిరేకం కాదు

టిడిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు సిఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు. ఉక్కు నిర్వాసితులకు కాంట్రాక్టు కార్మికులుగా ప్లాంట్‌లో 50 శాతం ఉపాధి కల్పించాలన్నారు. సింగిల్ విండో పద్ధతిలో ఏ కాంట్రాక్టర్ అయినా పాత కాంట్రాక్టు కార్మికులను తప్పనిసరిగా కొనసాగించాలనే నిబంధన పాటించాలని తెలిపారు. సింగిల్ విండో కాంట్రాక్టర్ విధానానికి తమ ప్రభుత్వం వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. గతంలో వెయ్యి మంది కాంట్రాక్టర్లు ఉండేవారని, ప్లాంట్‌పై ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రస్తుతం సుమారు 42 విభాగాల్లో ఇఒఐలను పిలిచారని చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో 42 మంది కాంట్రాక్టర్లు మాత్రమే ఉండేలా ప్లాంట్‌లో చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. దీనిని ప్రైవేటీకరణగా చిత్రీకరించడం తగదన్నారు.

**పల్లా వ్యాఖ్యలు దారుణం : కార్మిక సంఘాలు**

ప్లాంట్ ప్రైవేటీకరణకు ఉద్దేశించిన ఇఒఐలను పల్లా సమర్థించుకోవడంపై ఉక్కు కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. కర్మాగారంలోని విభాగాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుకూల కాంట్రాక్టర్లకు అప్పగించి, తదుపరి ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేసే కుట్ర సాగుతోందన్నారు. ఉక్కులో ఇఒఐలు, ప్లాంట్ ప్రైవేటీకరణ చర్యలకు వ్యతిరేకంగా ఆదివారం ఉదయం నుంచి కూర్మన్నపాలెం కూడలిలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## విభిన్న ప్రతిభావంతుల సమస్యలను కేబినెట్‌లో చర్చిస్తాం : పవన్ కల్యాణ్

పాయింట్ 6ను జనరల్ కేటగిరీకి మార్చాలని కోరారు. ఈ మార్పు వల్ల, అర్హులైన అంధ పురుష అభ్యర్థులకు కూడా ఉద్యోగావకాశాల్లో మేలు జరుగుతుందని వారు వివరించారు. దీనితో పాటు, విభిన్న ప్రతిభావంతులకు వ్యక్తిగత రేషన్ కార్డులు మంజూరు చేస్తే ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతాయని విజ్ఞప్తి చేశారు. సామాజిక పింఛన్ల పంపిణీలో ఎదురవుతున్న సమస్యలను కూడా వారు పవన్ దృష్టికి తీసుకెళ్లారు. వారి సమస్యలను ఓపికగా విన్న పవన్, ఈ అంశాలన్నింటినీ కేబినెట్ సమావేశంలో ప్రస్తావించి, పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అదేవిధంగా, విశాఖపట్నానికి చెందిన పలువురు ఆటో డ్రైవర్లు కూడా వినతి పత్రం సమర్పించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ‘స్త్రీ శక్తి’ పథకం వల్ల ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో తమ ఆదాయం గణనీయంగా తగ్గిపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన పవన్ కల్యాణ్, ‘స్త్రీ శక్తి’ పథకం అనేది సూపర్ సిక్స్ హామీలలో భాగమని, మహిళలకు ఆర్థికంగా అండగా నిలవాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. అయితే, ఆటో డ్రైవర్లు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు పెంచుకునే అంశాన్ని, వారు ప్రస్తావించిన ఇతర సమస్యలను కూడా మంత్రివర్గం దృష్టికి తీసుకువెళతానని తెలిపారు.

## గోదావరికి వరద ఉధృతి

నమోదైంది. ఇక్కడ మొదటి ప్రమాద హెచ్చరిక అమల్లో ఉంది. మరో పక్క ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద నీటి ప్రవాహం క్రమంగా పెరుగుతుంది. ఇక్కడ 10.60 అడుగుల మేర ప్రవాహం ఉంది. బ్యారేజ్ 175 గేట్లను పైకి లేపు సముద్రంలోకి 8.35 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తాగు సాగు నీటి అవసరాల నిమిత్తం తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టా కాలువలకు 8200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రానున్న 24 గంటల్లో వరద మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నదీ తీర ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

## కుప్పంలో ఉచిత బస్సు ప్రయాణం, కృష్ణ నీళ్ల ఆగమనం

**కుప్పం, ఆగస్టు 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గంలో స్త్రీ శక్తి పథకం కింద మహిళలకు అందిస్తున్న ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని స్వయంగా అనుభవించారు. ఆగస్టు 15 నుంచి అమలులోకి వచ్చిన ఈ పథకం పట్ల మహిళల సంతృప్తిని తెలుసుకునేందుకు, సీఎం చంద్రబాబు కుప్పంలో స్త్రీ శక్తి బస్సులో మహిళలు, రైతులతో కలిసి ప్రయాణించారు. ఈ సందర్భంగా వారితో సంభాషిస్తూ, ఉచిత



బస్సు సేవలు వారి జీవితాలను ఎలా సౌకర్యవంతం చేస్తున్నాయో అడిగి తెలుసుకున్నారు. మహిళలు ఈ సేవలతో డబ్బు ఆదా అవుతుందని, ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రయాణిస్తున్నామని సీఎంతో సంతోషంగా పంచుకున్నారు. ఈ పర్యటనలో చంద్రబాబు కుప్పం అభివృద్ధికి తన నిబద్ధతను మరోసారి నిరూపించారు. హంద్రీ-నీవా పథకం ద్వారా తొలిసారి కృష్ణా నది నీళ్లు కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు చేరాయి. బస్సు ప్రయాణంలో రైతులతో మాట్లాడిన సీఎం, కాల్వల్లో నీళు, చెరువుల నిండుదనం గురించి ఆరా తీశారు. కృష్ణమ్మ నీళ్ల రాకతో తమ పొలాలకు సాగునీరు అందుతుందని, ఇది తమకు ఎంతో ఆనందాన్నిచ్చిందని రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కుప్పం బ్రాంచ్ కెనాల్ వద్దకు చేరుకున్న చంద్రబాబు, కృష్ణమ్మకు జల హారతి ఇచ్చి, అక్కడ ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. హంద్రీ-నీవా కెనాల్ విస్తరణ పనులకు సంబంధించిన పైలాన్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ద్వారా కుప్పం ప్రాంతంలో సాగు, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను సీఎం హైలైట్ చేశారు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళల సాధికారత, హంద్రీ-నీవా ద్వారా రైతులకు సాగునీటి సౌకర్యం కల్పించడం వంటి చర్యలు చంద్రబాబు ప్రభుత్వం యొక్క ప్రజాకేంద్రీకృత విధానాలను ప్రతిబింబిస్తున్నాయి. కుప్పంలో ఈ పర్యటన ద్వారా, సీఎం చంద్రబాబు ప్రజలతో నేరుగా మమేకమై, వారి



అభిప్రాయాలను స్వీకరించి, అభివృద్ధి పనులకు మరింత ఊపు నడిపారు.









# సంక్షోభం నుండి సంక్షేమం వైపు

## సంక్షోభంలో ఉన్న బ్లాక్ బర్లీ పొగాకు రైతులను ఆదుకోవడమే మా లక్ష్యం - ఎండి విజయ సునీత

(బాపట్ల జిల్లా న్యూస్ 30, తెలుగు రాష్ట్రం ప్రతినిధి)

సంక్షోభం నుంచి రైతులను బయటకు తెచ్చేలా పొగాకు కొనుగోలు చేపట్టాలని ఏపీ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్, ఎస్ డబ్ల్యూసి మేనేజింగ్ డైరెక్టర్ ఎం.విజయ సునీత తెలిపారు. జిల్లాకు వచ్చిన ఎండి విజయ సునీత, జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి పర్చూరు మండలంలో శనివారం పర్యటించారు. పర్చూరు మండలం మార్కెట్ యార్డు లోని గోదాములో నిల్వచేసిన పొగాకు బేళ్లను ఎండి విజయ సునీత, జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి నిశితంగా పరిశీలించారు. కొనుగోలు చేసిన తీరుపై ఆరా తీశారు. వాటి నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. జిల్లా పర్యటనలో భాగంగా బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలులు, గోదాములలో నిల్వ, ప్రాసెసింగ్ ప్రక్రియ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో సమావేశం అయ్యారు. సంక్షోభం నుంచి రైతులను బయటికి తెచ్చే అంశాలపై సుధీర్ఘంగా చర్చించారు. కొనుగోలులకు సంబంధించిన దస్త్రాలు ఆమె పరిశీలించారు. పొగాకు ప్రాసెసింగ్ కొరకు సిద్ధం చేసిన డబ్ల్యు బి ఆర్, డబ్ల్యు బి ఎల్, డబ్ల్యు బి ఎక్స్ రకాల నమూనాలను పరిశీలించారు. సంక్షోభంలో ఉన్న బ్లాక్ బర్లీ పొగాకు రైతులను ఆదుకోవడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఎండి విజయ సునీత చెప్పారు. పొగాకు రైతులకు



ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన పొగాకును ప్రాసెసింగ్ చేయడానికి ప్రణాళిక రూపొందించాలన్నారు. గోదాముల నిల్వ సామర్థ్యం బాపట్ల జిల్లాలో లేకపోతే పొరుగు జిల్లాలో గోదాములకు వాటిని తరలించాలన్నారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపాలన్నారు. పొగాకును నిల్వ చేసి భద్రపరచడానికి నాలుగు ప్రాసెసింగ్ కేంద్రాలు మాత్రమే ఉన్నాయన్నారు. రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసినట్లు ధ్రువీకరణ పత్రాలు, వారి బ్యాంకు ఖాతాల పరిశీలన పూర్తయితే తక్షణమే వారికి నగదు పంపుతామన్నారు. మార్కెట్ యార్డ్ లలో గోదాములు చాలకపోతే వేరే హౌసింగ్ కార్పొరేషన్ గోదాములు ఉపయోగించుకోవాలన్నారు. అవి చాలకపోతే ప్రైవేట్ గోదాములను గుర్తించాలన్నారు. బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలు సెప్టెంబర్ లోగా పూర్తి చేయాలని కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. బాపట్ల జిల్లాలో 42 పొగాకు కొనుగోలు ద్వారా 9,900 టన్నుల బ్లాక్ బర్లీ పొగాకును కొనుగోలు చేశామన్నారు. ఇప్పటివరకు 6,396 మంది రైతుల నుంచి పొగాకు కొనుగోలు చేసినట్లు వివరించారు. ప్రస్తుతం జిల్లాలో ఆరు కొనుగోలు కేంద్రాలు కొనసాగుతున్నాయన్నారు. రైతులు అధైర్య పడవద్దని, వారికి అవగాహన కల్పిస్తూనే పొగాకు కొనుగోలు చేపట్టాలని పలు సూచనలు చేశారు. ప్రతిరోజు 300 మంది రైతుల నుంచి 600 టన్నులు పొగాకును కొనుగోలు చేయడమే లక్ష్యంతో అధికారులు ముందుకు సాగాలని ఆదేశించారు. రైతులను ఇబ్బందులు పెడితే ఉపేక్షించేది లేదన్నారు. అధికారులంతా సమన్వయం, స్ఫూర్తితో పనిచేయాలన్నారు. ఈ సంవత్సరం పొగాకు సాగు నిషేధం విధించినందున ఒక్క మొక్క సాగులో లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

రైతుల నుంచి కొనుగోలు చేసిన బ్లాక్ భర్లీ పొగాకు నిల్వ చేయడానికి 18 వ్యవసాయ మార్కెటింగ్ శాఖ గోదాములను గుర్తించామని కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. గుర్తించిన ఆ గోదాములలో పొగాకు నిల్వ చేయడానికి 1.37 లక్షల చదరపు అడుగుల సామర్థ్యం ఉందన్నారు. ప్రకాశం, గుంటూరు జిల్లాల్లోని సి ఎస్ పురం, దర్శి, గన్నవరం, జగ్గయ్యపేట, పిడుగురాళ్ళు, నడికుడి గోదాములకు పొగాకును తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే ప్రణాళికలు రూపొందించామన్నారు. మరో 11 ప్రైవేట్ గోదాములు ఖాళీగా ఉన్నట్లు గుర్తించామని, వాటిని వినియోగించడానికి అనుమతుల కొరకు ప్రభుత్వానికి నివేదించామన్నారు. రైతుల నుంచి ఎకనాలెడ్జిమెంట్ పూర్తి కాగానే వారి బ్యాంకు ఖాతాలకు నగదు జమ అవుతుందన్నారు. ఒక నెలలో వెయ్యి మెట్రిక్ టన్నులు పొగాకును ప్రాసెసింగ్ చేయడానికి ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రస్తుతం పర్చూరు, యద్దనపూడి, ఇంకొల్లు, అద్దంకిలోని తమ్మవరం, కొరిశపాడులోని గోదాములు నిండాయన్నారు. నిండిపోయిన గోదాముల నుంచి పొగాకు తక్షణమే తరలించాలని ఆదేశించారు. కొనుగోలు చేసే పొగాకులో సిఆర్ అధికంగా లేకుండా చూడాలన్నారు. కొనుగోలు సమయంలో లోపాయి కారి ఒప్పందాలతో రైతులను ఇబ్బందులు పెడితే ఉపేక్షించేది లేదన్నారు. వారి వెంట మార్కెటింగ్ శాఖ ఆర్జెడి కె.శ్రీనివాసరావు, ఆర్ డి డి ఎం.దివాకర్, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి కె రమేష్ బాబు, మార్క్ ఫెడ్ జిఎం కరుణశ్రీ, ఆర్డీఓ పి.గ్లోరియా, తదితరులు ఉన్నారు.





## పోలీస్ ఉద్యోగుల కుటుంబాలకు అండగా ఉంటా.. జిల్లా ఎస్పీ తుషార్ డూడి




### "పోలీస్ వెల్ఫేర్ డే" కార్యక్రమం నిర్వహించిన జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్

( బాపట్ల జిల్లా న్యూస్ 30, తెలుగు రాష్ట్రం ప్రతినిధి )

పోలీస్ ఉద్యోగుల కుటుంబాలకు అండగా ఉంటూ వారి సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ తెలిపార్. ఆగష్టు 30న శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో "పోలీస్ వెల్ఫేర్ డే" కార్యక్రమాన్ని ఎస్పీ స్వయంగా నిర్వహించారు. పోలీస్ సంక్షేమంలో భాగంగా, బాపట్ల జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ వివిధ కారణాలతో మరణించిన పోలీస్ ఉద్యోగుల కుటుంబ సభ్యులతో పాటు, పోలీస్ శాఖలో విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ ఉద్యోగులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారి వ్యక్తిగత సమస్యలు, ప్రభుత్వం నుండి రావలసిన బకాయిలు, ఇతర రాయితీల గురించి సమీక్షించారు. ఎస్పీ ప్రత్యేకంగా ప్రతి ఒక్కరితో మాట్లాడి, వారికి ప్రభుత్వం నుండి రావలసిన భద్రతా నిధులు, జీపీఎఫ్, ఎపిజీఎల్ఐ, గ్రూప్ ఇన్సూరెన్స్ స్కీమ్, లీవ్ ఎన్ క్యాష్మెంట్ నగదు వంటి పలు రాయితీలు సకాలంలో అందాయా లేదా అన్నది అడిగి తెలుసుకున్నారు. కారుణ్య నియామక ప్రక్రియ, ఇంకా ప్రభుత్వం నుండి బకాయి ఉన్న అంశాల ప్రస్తుత స్థితిగతులను తెలుసుకొని, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన పోలీస్ ఉద్యోగులకు, సర్వీసులో ఉండి మృతి చెందిన పోలీస్ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. జిల్లా పోలీస్ యంత్రాంగం వారి కుటుంబ సభ్యులు అందరూ పోలీస్ కుటుంబంగా భావిస్తామన్నారు. వారి సంక్షేమం చూడాల్సిన బాధ్యత మా మీద ఉందని, ఎవరైనా సమస్యలు ఎదుర్కొంటుంటే స్వయంగా మాకు తెలుపవచ్చునన్నారు. వ్యక్తిగత, కుటుంబ, పిల్లల చదువుల వంటి ఏ సమస్యలైనా తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కారుణ్య నియామకాలు వేగవంతంగా జరిగే విధంగా తగిన చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ. వి. శ్రీనివాసరావు, సిసిఎస్ డిఎస్పీ పి.జగదీష్ నాయక్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ షేక్ మౌలుద్దీన్, డిపిఒలోని వివిధ విభాగాల సిబ్బంది, ఉద్యోగ విరమణ చేసిన పోలీస్ ఉద్యోగులు, మరణించిన పోలీస్ ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




# అందరికీ ఏజ్ పెరిగితే బాలయ్యకు క్రేజ్ పెరుగుతోంది...

# ఏ రంగంలోనైనా నెంబర్ వన్!: మంత్రి నారా లోకేశ్

- హీరోగా 50 ఏళ్లు పూర్తి
- వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందిన నందమూరి బాలకృష్ణ
- హైదరాబాద్‌లో ఘనంగా కార్యక్రమం
- చరిత్ర సృష్టించడం బాలయ్యకే సాధ్యమన్న మంత్రి నారా లోకేష్
- సినిమా, రాజకీయాలు, ఓటీటీలో ఆయనే నంబర్ వన్ అని ప్రశంస
- పాల్గొన్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, సినీనటి జయసుధ, ఇతర ప్రముఖులు

హైదరాబాద్ ఆగస్టు 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

చరిత్ర సృష్టించాలన్నా, చరిత్ర తిరగరాయాలన్నా హీరో నందమూరి బాలకృష్ణ వలనే సాధ్యమవుతుందని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఇటీవల వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం







సంపాదించిన బాలకృష్ణకు హైదరాబాద్ లోని ఒక హోటల్ లో పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, బాలయ్యను వేనోళ్ల కొనియాడారు. "50 ఇయర్స్ ఇండస్ట్రీ. సినిమా, సేవా కార్యక్రమాలు, టెలివిజన్ షోస్, పాలిటిక్స్ ఎందులోనైనా బాలయ్య నంబర్ 1. విశ్వవిఖ్యాత స్వర్గీయ శ్రీ నందమూరి తారకరామారావు గారి తరువాత రాజకీయాల్లో హ్యాట్రిక్ సాధించిన ఒకే ఒక్క మాస్ మహారాజ్ బాలయ్య. హీరోలకి ఫ్యాన్స్ ఉంటారు కానీ మాస్ మహారాజ్ కు డై హార్డ్ ఫ్యాన్స్ ఉంటారు. 1974లో తాతమ్మ కలతో మొదలైన సినీ ప్రయాణం అఖండ 2 వరకూ వచ్చింది. అందరికీ ఏజ్ పెరుగుతుంది కానీ బాలయ్య కు క్రేజ్ పెరుగుతుంది. ఇప్పటికి 109 సినిమాల్లో హీరోగా చేశారు. 100 రోజులు కాదు 1000 రోజులు ఆడిన సినిమాలు ఉన్నాయి.

**ఏదైనా బాలయ్యకే సాధ్యం**

ఎవరైనా ఒక జానర్ లో సక్సెస్ అవుతారు. కానీ అన్ని జానర్స్ లో సినిమాలు తీసి ముద్ర వేసిన కథానాయకుడు బాలయ్య. పౌరాణికం, జానపదం, చారిత్రకం, ఆధ్యాత్మికం, సోషియో ఫాంటసీ,







బయోపిక్, సైన్స్ ఫిక్షన్.. ఇలా పాత్ర ఏదైనా బాలయ్య కే సాధ్యం. గౌతమీ పుత్రశాతకర్ణి అని మీసం మెలేసినా ....అఖండ అని గర్జించినా బాలయ్యకే చెల్లింది. రాముడు, కృష్ణుడులో మనకు తెలిసిన రూపం నందమూరి తారక రామారావు గారిది. మళ్లీ అంతటి చూడచక్కని రూపం, నట విశ్వరూపం బాలయ్య బాబుదే. శ్రీరామరాజ్యం చిత్రంతో మళ్లీ మనందరికీ మరోసారి ఎన్టీఆర్‌ని గుర్తుకుతెచ్చారు.

**ఓటిటి లోనూ బాలయ్యే మేటి**

బాలయ్య నిర్మాతల హీరో, దర్శకుల హీరో, అభిమానుల హీరో. తన సినిమానే కాదు... సినిమా పరిశ్రమ కూడా బాగుండాలి అని భావించే నిజమైన హీరో. ఇప్పుడు ఓటీటీ వంతు వచ్చింది. బాలయ్య అక్కడా దుమ్ము రేపుతున్నారు. బాలయ్య షో చేస్తే రేటింగ్స్ రాకెట్లా దూసుకెళుతున్నాయి. ప్రేక్షకులకు అద్వితీయ వినోదాన్ని అందించారు. బాలయ్య అడుగు పెడితే ఎక్కడైనా అన్ స్టాపబుల్ అని ఆయన చేసిన రియాలిటీ షోనే నిదర్శనం. అన్ స్టాపబుల్ తో బాలయ్య ఓటీటీలో కూడా సత్తా చాటారు. మూడు నంది అవార్డులు, సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డులు వచ్చాయి.


**బాలయ్య భోళా శంకరుడు**

బాలయ్య అంటే భోలా శంకరుడు. స్వచ్ఛమైన మనసు బాలయ్యది. ఉన్నది ఉన్నట్లు మాట్లాడుతాడు. దాపరికం లేదు... ముందొకమాట వెనుక ఒకమాట ఉండదు. అదీ బాలయ్య స్టైల్! ప్రజలకు కష్టం వచ్చినప్పుడు సాయంలో ముందుంటారు. 2009 కృష్ణా వరదల్లో ముందుకు వచ్చి





సాయం చేశారు. కరోనా సమయంలో ధైర్యంగా అఖండ సినిమా పూర్తి చేసి ఇండస్ట్రీలో ధైర్యాన్ని నింపారు. ఆ సమయంలో ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు రూ.50 లక్షల చొప్పున సాయం చేశారు. మరో రూ.25 లక్షలు కరోనా విపత్తు సహాయం కోసం ఇచ్చారు..." అని లోకేశ్ వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, సినీనటి జయసుధ, పలువురు సినీ, రాజకీయ రంగ ప్రముఖులు, బాలకృష్ణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.






## న్యాయ సేవ సహాయ కేంద్రం ప్రారంభం




**తాడేపల్లిగూడెం, ఆగస్ట్ 30 (తెలుగురాష్ట్రం విలేకరి):** స్థానిక రెవెన్యూ డివిజనల్ ఆఫీసులో న్యాయ సేవ సహాయ కేంద్రాన్ని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికందర్ భాష శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో తెలియజేశారు .సీనియర్ సిటిజన్స్ చట్టం గురించి తెలిపారు. బాల్యవివాహాలు, చిన్న వయసులో గర్భం దాల్చడం వల్ల వచ్చే తీవ్ర పరిణామాలు గురించి వివరించారు. ఈ సదస్సులో ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బానో, బార్ అసోసియేషన్ అధ్యక్షులు శిరిగినీడి విజయకృష్ణ ,అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే. శివరామకృష్ణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ విశాలి, సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆది ప్రసాద్, పాల్గొన్నారు. ఈ న్యాయ సేవా కేంద్రానికి ఈ ప్రవీణ్ ప్రకాష్ న్యాయవాదిగా, ఎస్ చక్రధర్ పారా లీగల్ వాలంటీర్ గా నియమించారు. ప్రతి శనివారం ఆర్డిఓ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ సదస్సులో అడ్వకేట్లు అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు అదేవిధంగా జిల్లా పరిషత్ హై స్కూల్ లో పదో తరగతి విద్యార్థులకు బాల్యవివాహాలు ,చిన్న వయసులో గర్భం దాల్చడం వల్ల వచ్చే తీవ్ర పరిణామాలపై తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి కే మాధవి అవగాహన కల్పించారు .ఈ న్యాయ విజ్ఞాన సదస్సులో బాల వివాహాల వల్ల వచ్చే అనర్థాలు పిల్లల చదువులు గురించి తెలిపారు ఈ సదస్సులో వారు అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ విజయ కృష్ణ ,ఐసిడిఎస్ సూపర్వైజర్ విశాలి, వీకర్స్ కాలనీ పిహెచ్సి డాక్టర్ శ్రావ్య, హెడ్మాస్టర్ సత్యనారాయణ, ఎస్సై వెంకట్ రమణ పాల్గొన్నారు.

## ఘనంగా పరిటాల కాంస్య విగ్రహ ఆవిష్కరణ




**కళ్యాణదుర్గం, ఆగస్టు 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** పెనుగొండ పట్టణంలో మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే పరిటాల రవీంద్ర కాంస్య విగ్రహన్ని మంత్రి సవితమ్మ ఆవిష్కరించారు.ఎంపీ బీకే పార్థసారది, ఎమ్మెల్యేలు పరిటాల సునీతమ్మ, అమిలినేని సురేంద్ర బాబు, ధర్మవరం టీడీపీ ఇంచార్జ్ పరిటాల శ్రీరాములు, సిద్దార్థ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.. పరిటాల రవీంద్ర 67వ జయంతి సందర్బంగా కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. పరిటాల రవీంద్ర కుటుంబంతో చాలా మంచి అనుబంధం ఉందని, సన్నిహిత సంబంధం అప్పటి నుంచి నేటి శ్రీరాములు వరకు కొనసాగుతుందటం చాలా గొప్ప విషయమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గుర్తు చేసుకున్నారు.

## మాజీ మంత్రి కన్నబాబుకు వైసిపి నేత రమణారావు పరామర్శ



**కాకినాడ, ఆగస్టు 30 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి)** :పితృ వియోగంతో బాధపడుతున్న మాజీ మంత్రి కురసాల కన్నబాబు ను శనివారం కాకినాడలో అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ సీనియర్ వైసిపి నాయకుడు,గుడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు పరామర్శించారు. కన్నబాబు తండ్రి సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.సత్యనారాయణ చిత్రపటానికి రమణారావు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలిపారు.మాజీ మంత్రి కన్నబాబు కుటుంబాన్ని పరామర్శించిన వారిలో వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి తెన్నేటి కిషోర్, భీమనపల్లి సర్పంచ్ పెయ్యల రాజ్ కుమార్,ఉప్పలగుప్తం మండల వైసిపి ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజ్, ఈదరపల్లి మాజీ సర్పంచ్ నక్కా సంపత్ కుమార్, వైసిపి నాయకులు పరమట రాజశేఖర్,మారోజు వినోద్ కుమార్,పందిరి సుబ్బరాజు,కుంచే సత్యనారాయణ,గంటా లక్ష్మీ ప్రసాద్, కుంచే అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## నిండు కుండలా తమ్మిలేరు రిజర్వాయర్




**చింతలపూడి, ఆగస్టు 30 (తెలుగు రాష్ట్రం విలేఖరి):** ఏలూరు జిల్లా చింతలపూడి మండలం లోని తమ్మిలేరు రిజర్వాయర్ పూర్తి నీటి మట్టం 355 అడుగులు. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 3.000 టి. ఎం. సి. లు కాగా 30-08-2025 శనివారం ఉదయం అందిన సమాచారం ప్రకారం తమ్మిలేరు నీటి మట్టం 348.54 అడుగులు గాను నీటి నిల్వ 0.703 టి. ఎం.సి.లు గాను, గోనెల వాగు నీటి మట్టం 348.08 అడుగులు గాను నీటి నిల్వ 1.158 టి. ఎం. సి. లు గాను ఉంది. ఇన్ ఫ్లో 5008 క్యూసెక్కులు, ఔట్ ఫ్లో 934 క్యూసెక్కులు ఉంది. నీటిని దిగువకు విడుదల చేసినందున తమ్మిలేరు పరీవాహక ప్రాంత ప్రజలు, సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించడమైనది.

### చట్టాలు,పేదరిక నిర్మూలన కోసం అమలు అవుతున్న సంక్షేమ కార్యక్రమాలుపై

# ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలి




**ఏలూరు, ఆగస్టు 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యూ మాడ్యూల్ లీగల్ సర్వీసు క్యాంపు ఆన్ నల్సా స్కీములుపై అవగాహన సదస్సు కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి యస్.శ్రీదేవి, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ పాల్గొన్నారు. ఏలూరు,ఆగస్టు 30: సత్వర న్యాయం కోసం చట్టాలపై అవగాహనతో పాటు పేదరిక నిర్మూలన కోసం ఆమలు అవుతున్న సంక్షేమ పథకాలుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి యస్.శ్రీదేవి పేర్కొన్నారు. ఏలూరు జిల్లా కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యూ మాడ్యూల్ లీగల్ సర్వీసు క్యాంపు ఆన్ నల్సా స్కీములుపై నిర్వహించిన ఒక్కరోజు అవగాహన సదస్సును జిల్లా ప్రధాన న్యాయమూర్తి యస్.శ్రీదేవి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి యస్.శ్రీదేవి, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి కె. రత్న ప్రసాద్,బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోనె సీతారామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలకు బ్యాంకు లింకేజీ 3,103 సంఘాలకు రూ 225.17 కోట్లు, స్త్రీనిధి ద్వారా 1935 సంఘాలకు రూ 66.32 కోట్లు, ఉన్నతి స్కీము ఎస్టీ, ఎస్సీ 231 గ్రూపులకు రూ 2.28 కోట్లు,దివ్యాంగ విద్యార్థులకు 3 టచ్ ఫోన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి యస్.శ్రీదేవి మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో భీమడోలు,తాడేపల్లిగూడెం, చింతలపూడి,భీమవరం, నరసాపురం,తణుకు, తాడేపల్లిగూడెం, కొవ్వూరు, పాలకొల్లు, నిడదవోలు మండల సేవాసంస్థల సేవా కమిటీలు పనిచేస్తున్నాయని అన్నారు. ఇటీవల జరిగిన లోక్ అదాలత్ లో సివిల్ 373 కేసులు, యంబిఓపి 292 కేసులు, క్రిమినల్ 10,896 మొత్తం 11,561 కేసులు పరిష్కరించడం జరిగిందన్నారు.ఈ కేసులు అవార్డులు నిమిత్తం రూ 28.54 కోట్లు ప్రకటించడం జరిగిందన్నారు. అదే విధంగా పియల్ సి కేసులు పరిష్కరించి అవార్డు సొమ్ము క్రింద రూ 81.16 లక్షలు చెల్లింపులు జరిగాయని తెలిపారు. పేదలకు సత్వర న్యాయం అందించడంలో భాగంగా కేసులకు న్యాయం సహాయం అందించడం జరిగిందిన్నారు. జిల్లా వ్యాప్తంగా న్యాయ చట్టాలపై అవగాహన కల్పించేందుకు పాఠశాలలు, కళాశాలలు, కొన్ని గ్రామాలలో 496 న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించామని తెలిపారు. జిల్లాలో మీడియేషన్ సెంటర్ల ను ఏర్పాటుచేసి 49 మంది మీడియేటర్లను నియమించామని, తద్వారా 1086 కేసులు పరిష్కారం చేసామని అన్నారు. అదేవిధంగా నల్సా క్రింద పేద నిర్మూలనకు అమలవుతున్న పలు సంక్షేమ కార్యక్రమాలుపై పూర్తి అవగాహన కల్పించుటకు ఈ రోజు స్టాల్స్ ను ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో వివిధ శాఖలు ద్వారా పేదరిక నిర్మూలనకు అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలు సవినయంగా వివరించారు. అంగన్వాడి కేంద్రాలలో పిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు చిల్డ్రన్స్ హెూమ్స్ నిర్వహిస్తున్నామని అన్నారు. గృహ హింస గురించి పిజిఆర్ యస్ లో అందుతున్న ఫిర్యాదులపై కౌన్సిలింగులు నిర్వహించి ఇప్పటికే 132 కేసులు విజయవంతంగా పరిష్కరించామని తెలిపారు. వన్ స్టాపు సెంటర్లు ద్వారా మహిళలకు రక్షణతో పాటు సత్వర న్యాయం అందించడం జరుగుతుందన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని,ఈ వ్యవస్థ నియంత్రించేందుకు 1098 టోల్ ఫ్రీ నెంబరరు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డ్రగ్స్ నియంత్రణ కోసం పాఠశాలలు, కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నషా ముక్త భారత్ అభియాన్ టోల్ ఫ్రీ నెంబరు 14446 లేదా ఈగల్ టోల్ ఫ్రీ నెంబరు 1972 కు ఫిర్యాదులు అందించ వచ్చునని అన్నారు. మత్తు పదార్థాలు అలవాటు పడిన వారికి కౌన్సిలింగును, వైద్యం అందించేందుకు అడిక్షన్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.విభిన్న ప్రతిభావంతులకు సంక్షేమంలో భాగంగా అసెస్మెంటు క్యాంపులు నిర్వహించి వీల్ చైర్లు,తదితర ఉపకారణాలను అందిస్తున్నామన్నారు. అదేవిధంగా సీడ్ క్యాపిటల్ క్రింద వివిధ ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి బ్యాంకర్లతో రుణ సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో పరిశ్రమలు ద్వారా యువతకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఇవే కాకుండా ఎస్సీ,ఎస్టీ కార్పొరేషనులు ద్వారా వివిధ సంక్షేమ పథకాలతో పాటు అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. వ్యవసాయ సాగులో డ్రోన్ల వినియోగంపై కూడా శిక్షణ అందించి ఉపాధి కల్పించే కార్యక్రమాలు అమలు చేస్తున్నామని అన్నారు. జిల్లాలో ఇటీవల కాలంలో డ్రగ్స్ నియంత్రణపై జిల్లా ఎస్పీతో కలిసి ముమ్మరంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.డ్రగ్స్ రహిత జిల్లాగా ఉంచేందుకు చేస్తున్న కార్యక్రమాల్లో రాష్ట్రంలో మన ఏలూరు జిల్లా ఒకటిగా ఉందన్నారు. జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ద్వారా వారిలో విశ్వాసం పెంపొందించవచ్చని అన్నారు.ఆ దిశగా జిల్లా పోలీసు యంత్రాంగం న్యాయ వ్యవస్థతో కలిసి పనిచేస్తుందని తెలిపారు.లోక్ అదాలత్ లో వివిధ కేసులు పరిష్కారంలో మన జిల్లా టాప్ 5 లో ఉందన్నారు.నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోఫిక్ సబ్ స్టాన్సెస్ యాక్టు



కింద 7 కేసులు నమోదు చేసి 419 కేజీలు గంజాయి స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు.ఫోక్సో కేసులకు సంబంధించి న్యాయ స్థానాలు ద్వారా సత్వర న్యాయం అందటంలో బాధితులు ధైర్యంగా ముందుకు వస్తున్నారని అన్నారు. నాన్ బెయిల్ వారెంటుకు సంబంధించి దీర్ఘకాలంగా ఉన్న పలు కేసులు పరిష్కరించడం జరిగిందన్నారు. హిట్ అండ్ రన్ యాక్సిడెంటు కేసులు సంబంధించి ఇటీవల కాలంలో జిల్లా కలెక్టరు వారి సహకారంతో 15 మందికి న్యాయ సహాయంతో పాటు ఆర్థిక సాయం అందించడం జరిగిందన్నారు. సమాజానికి చేటు చేస్తున్న డ్రగ్స్ నియంత్రణ పట్టిష్ట చర్యలు చేపట్టామన్నారు.మత్తు పదార్థాలు మూలంగా ఒక వ్యక్తికే కాకుండా మొత్తం జాతి భవిష్యత్తుకే నష్టం కలుగుతుందన్నారు.ఇటువంటి చర్యలకు పాల్పడే వారి సమాచారం అందించాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచబడతాయని అన్నారు. డ్రగ్స్ నియంత్రణకు ఇప్పటికే పాఠశాలలు, కళాశాలలు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం తో పాటు, పాఠశాలలు కళాశాలలో 877 ఈగల్ క్లబ్లను ఏర్పాటు చేశామన్నారు.

**స్టాల్స్ సందర్శన.**

వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై వివిధ రకాల స్టాల్స్ ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి యస్.శ్రీదేవి, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ సంయుక్తంగా ప్రారంభించి, పరిశీలించారు.ముందుగా ఐసిడియస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సందర్శించారు. అనంతరం డియల్ యస్ఏ న్యాయ సదస్సు, డిఆర్డిఏ, డిపిఓ, పోలీసు, వైద్య ఆరోగ్యశాఖ, విభిన్న ప్రతిభావంతులు, సోషల్ వెల్ఫేరు మరియు బిసి వెల్ఫేరు స్టాల్స్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇతర న్యాయమూర్తులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాదు,బార్ అసోసియేన్ అధ్యక్షులు కోనె సీతారామ్,జిల్లా డిఆర్డిఏ పిడి ఆర్.విజయ రాజు, ప్రముఖ సీనియర్ న్యాయవాది కానాల రామకృష్ణారావు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, న్యాయవాదులు, స్థానిక ప్రజలు, మహిళలు, విద్యార్థిని, విద్యార్థులు, జిల్లా కోర్టు ఉద్యోగులు, సిబ్బంది,పాల్గొన్నారు.



# ఉచిత బస్ ప్రయాణంపై మహిళల హర్షం




**కాకినాడ, ఆగస్టు 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** ఉచిత ప్రయాణం. సంతోషం ..ఇది మంచి ప్రభుత్వం...మా ప్రభుత్వం..మా కలలు సాకారం చేసిన ప్రభుత్వ పెద్దలకు ధన్యవాదాలు తెలుపుతూ మండల కేంద్రం తొండంగిలో ఉచిత బస్ ప్రయాణం పై మహిళలు హర్షాతిరేకం వ్యక్తం చేశారు.స జాపర్ సిక్స్ పథకాల వల్ల తమ ఆర్థిక వెతలు తీరాయని ఫ్రీ జర్నీ మరింత ప్రయోజనకారని మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.ఇవాళ తొండంగిలో సీనియర్ నేత యనమల రాజేష్ పర్యవేక్షణలో జరిగిన ఉచిత బస్ పథకం విజయోత్సవ సభకు ముఖ్య అతిథిగా ప్రభుత్వ విఫ్ యనమల దివ్య ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, కాకినాడ నగర మాజీ మేయర్ సుంకర పావని,చైర్ పర్సన్ నార్ల భువన సుందరి,కుసుమంచి శోభారాణి,తమరాన వరలక్ష్మి, అద్దేపల్లి జానకి,బడే మంగలతో కలిసి హాజరైయ్యారు.మహిళలతో కలిసి ఎమ్మెల్యేలు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం చేసారు. మహిళలకు స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం చంద్రబాబుకు థ్యాంక్స్ తెలుపుతూ మహిళలు పోస్ట్ బాక్స్ లో కార్డులు వేసారు. అంతకు ముందు డ్వాక్రా సంఘాలకు 8కోట్ల 36 లక్షల రూపాయలు చెక్కును ఎమ్మెల్యే యనమల దివ్య అందజేసారు. ఈసందర్భంగా యనమల దివ్య మాట్లాడుతూ యువసారధి నారా లోకేష్ సారధ్యంలో కూటమి ప్రభుత్వం మహిళాసాధికారతకు అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు ఈ కార్యక్రమంలో తుని మండల టీడీపీ అధ్యక్షుడు చింతంనీడి అబ్బాయి, తొండంగి మండల టీడీపీ అధ్యక్షుడు చొక్కా అప్పారావు, ఇనుగంటి సత్యనారాయణ,మోతుకూరి వెంకటేష్ చొక్కా కాశీ,అరిగెల నర్సింహమూర్తి ,జిల్లా మత్స్యకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కోడా వెంకటరమణ,పంపా ప్రాజెక్ట్ చైర్మెన్ బైరవర్జుల చందు,నరహర శెట్టి సూర్యప్రకాష్,కొయ్యా మల్లేష్ కొయ్యా కేశవ్, కొయ్యా సూరిబాబు, బంటుపల్లి అన్వేష్ దూలం మురళి, కాలిపోయిన చంద్రరావు, బెండపూడి నాయుడు నేమాల కృష్ణ,పక్కుర్తి వంశీకృష్ణ, సారిపల్లి బాబూరావు,నేమాల విజయ్, చొక్కా మహంకాళి యనమల గోవిందరాజులు,పేకేటి దార కొండ, అంగులూరి సుధాకర్, సోమాల ప్రసాద్,దడాల విజయ్ పక్కుర్తి నూకరాజు,పేకేటి యతిమాని,పేకేటి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు



# హోల్ సేల్ మార్కెట్‌ను ఆకస్మికంగా సందర్శించిన జాయింట్ కలెక్టర్

**తాడేపల్లిగూడెం, ఆగస్ట్ 30 (తెలుగురాష్ట్రం విలేకరి):** బ్రహ్మానంద రెడ్డి హెూల్ సేల్ మార్కెట్ ను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కర్నూలు నుండి వచ్చిన ఉల్లి పాయలను పరిశీలించారు. కర్నూలులో రైతులు పండిస్తున్న ఉల్లిపాయకు కనీసం మద్దతు ధర రాకపోవడంతో మద్దతు ధర కల్పించాలని రైతులు ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మన జిల్లాలో తాడేపల్లిగూడెం బ్రహ్మానందం రెడ్డి హెూల్ సేల్ మార్కెట్ ను జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించి వ్యాపారస్తులు, రైతులతో మాట్లాడారు. కర్నూలు నుండి వచ్చిన ఉల్లిపాయలకు ఎందు కారణంగా ధర తక్కువగా ఉంది, రైతులకు ఎందుకు గిట్టుబాటు ధర రావడం లేదు అని పలు విషయాలను వ్యాపారస్తులను, రైతులను జాయింట్ కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాల వలన ఉల్లిపాయలు తడిచి పాడవడం వలన ఉల్లి ధర భారీగా తగ్గటము జరిగినదని కర్నూలు నుండి ఇక్కడికి తీసుకు వచ్చేసరికి ఉల్లిపాయలు పాడైపోతున్నాయని అందు వలన ఉల్లిపాయలను ఎవరూ కొనుగోలు చేయడం లేదని వివరించారు. కర్నూలు ఉల్లి రైతులకు కనీస మద్దతు ధర వచ్చేలా చూడాలని జిల్లా



జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. అలాగే కర్నూలు నుండి వచ్చిన ఉల్లిపాయలను రైతు బజార్లో అమ్మే విధంగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బాదంపూడి మార్కెట్ యార్డ్ చెక్ పోస్ట్ ను జాయింట్ కలెక్టర్ టి .రాహుల్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. చెక్ పోస్ట్ కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. ప్రతిరోజు కర్నూలు నుండి ఎన్ని వాహనములు వస్తుంటాయి, ఎంత సరుకు వస్తుంది అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు కర్నూలు నుండి వచ్చే ఉల్లి వాహనములు అన్నియు కూడా మూమెంట్ రిజిస్టర్ లో నమోదు చేయాలని బాదంపూడి మార్కెట్ యార్డ్ చెక్ పోస్ట్ సూపర్వైజర్ ను ఆదేశించారు. కర్నూలు ఉల్లి పంట రైతులుకు నష్టం రాకుండా కనీస మద్దతు ధర వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ కతీఫ్ కౌశల్ భానో, మార్కెటింగ్ డిప్యూటీ డైరెక్టర్ పి.పాపారావు, జిల్లా మార్కెటింగ్ ఏడి కె.సునీల్ కుమార్, తహసిల్దార్ ఎం.సునీల్ కుమార్, బ్రహ్మానంద రెడ్డి రైతు మార్కెట్ సెక్రటరీ గౌతు భాషా, బాదంపూడి చెక్ పోస్ట్ సూపర్వైజర్ కిషోర్, ఉల్లి రైతులు, వ్యాపారస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఉభయ గోదావరి
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

## సారథ్యం యాత్ర విజయవంతం చేయండి : పిక్కి నాగేంద్ర



**రాజమహేంద్రవరం, ఆగస్ట్ 30: (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ తలపెట్టిన సారథ్యం యాత్రలో భాగంగా సెప్టెంబర్ 1 వ తారీకు రాజమహేంద్రవరం రానున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని బిజెపి నాయకులు కార్యకర్తలు విజయవంతం చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి పార్టీ దేశంలోనే కాదు మన ఆంధ్ర రాష్ట్రంలో కూడా బలోపేతం కావాలని అందుకు ప్రతి ఒక్క నాయకులు కార్యకర్తలు దీక్షతో పని చేయాలని పార్టీ బలోపేతం అవ్వాలని ఆయన అన్నారు. యాత్ర సోమవారం స్థానిక వై జంక్షన్ నుంచి దేవిచౌక్ మీదుగా సుబ్రమణ్యం మైదానం వరకు సాగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకులు, జిల్లా, మండల నాయకులు పాల్గొంటారు అని తెలిపారు. ఈ సభకు సుమారు 11,000 మంది ఈ సభకు వచ్చే అవకాశం ఉంది అని తెలియజేశారు. పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు.

## చెదల దివ్యతేజ మృతిపై విచారణ చేపట్టాలి



**మారేడుమిల్లి, ఆగస్టు 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** మారేడుమిల్లి ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల నందు 7వ తరగతి చదువుతున్నా చెదల దివ్య తేజ హాస్టల్ బాత్ రూములో నిన్న సాయంత్రం సుమారు 4,గంటల సమయంలో కిందపడి తలకు బలమైన దెబ్బతగిలి విద్యార్థిని ఇబ్బంది పడుతున్న సంబంధిత హాస్టల్ సిబ్బంది, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అలాగే రంపచోడవరం ఎటి డబ్ల్యు ఓ ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే గిరిజన విద్యార్థి దివ్య తేజ చనిపోవడం జరిగింది.హాస్టల్ లో చదువుతున్న విద్యార్థినిలకు ఏం జరుగుతుందో గుర్తించలేని పరిస్థితిలో హాస్టల్ సిబ్బంది,డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అలాగే ఎటి డబ్ల్యు ఓ ఉన్నారని, సరైన పర్యవేక్షణ లేని మూలంగానే విద్యార్థినీ నిండు ప్రాణాలు పోయాయి.ఈ సంఘటనపై పూర్తిస్థాయిలో తక్షణమే విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా ఎటి డబ్ల్యు ఓ,ట్రైబల్ వెల్ఫేర్ డీడీ వొచ్చిన దగ్గర నుండి ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి అని గిరిజనులు ఆరోపిస్తున్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నత అధికారులను కోరారు.

## త్రిలోక పూజ్యుడు మహాశివుడు

### ఈవో పెద్దిరాజు ఆధ్వర్యంలో శివాలయ కమిటీ ప్రమాణ స్వీకారం



**రాజమంద్రి రూరల్, ఆగస్ట్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** కడియం మండల మురమండ గ్రామంలో వేంచేసియున్న శ్రీ శ్రీ శ్రీ సర్వకామదాంబ సమేత శ్రీ సోమేశ్వర స్వామి ఆలయం నందు ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం ఆలయ ఈవో పెద్దిరాజు సభ్యులతో నిర్వహించారు. ఈవో పెద్దిరాజు మాట్లాడుతూ ఆలయ ధర్మకర్త గా దామెర్ల రవిబాబు, సభ్యులు గా కర్రా వరలక్ష్మి, సుంకర నాగలక్ష్మి,లక్కోజు రాణి పురోహితులు బాదంపూడి బుచ్చయ్య శాస్త్రీ, గన్ని చిన్నబాబి, బిళ్ళకుర్తి నాగరాజు, తులూరి సాయికృష్ణ, లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈసందర్భంగా ఆలయ ధర్మకర్త దామెర్ల రవిబాబు మాట్లాడుతూ గ్రామపెద్దలు, గ్రామస్థులు సూచనలు సలహాలు తీసుకుని భక్తి శ్రద్ధలతో ప్రతీ కార్యక్రమాన్ని నిర్వహించి, ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు కమిటీ డైరెక్టర్ దేవళ్ళ రామ్మోహన్ రావు, మురమండ సాగునీటి సంఘం ప్రెసిడెంట్ గన్ని పెద్దబాబి, ఉప సర్పంచ్ యర్రంశెట్టి వీరబాబు, కోయూనిట్ ఇంచార్జ్ పోతుల వీర్రాజు, కడియం మండల బిజెపి అధ్యక్షులు బొరుసు సుబ్రహ్మణ్యం, మద్దిపాటి చిన్నారావు, మద్దిపాటి చిన్నబాబు, గుణ్ణం సతీష్, కర్రా వీరభద్రరావు, షేక్ మీరాభాయ్, బత్తుల చిన్నగణేష్, పిల్లా వెంకట్రావు, బత్తుల కామేశ్వరరావు, బొప్పన, లోవరాజు, అంగర్ రమేష్, జట్ల శివ శంకర్, కోటిపల్లి రాము, బొల్లోజు శంకరం, భజన వెంకన్న దొర, ఇల్లపు హనుమంతు పాల్గొన్నారు.

## గిరిజనులకు ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారిత

### -ఎమ్మెల్యే శిరీషా దేవి




**రంపచోడవరం, ఆగస్టు 30 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** భువనేశ్వర్, ఒడిశాలో జరిగిన తీయ స్థాయి ఎస్టీ సంక్షేమ కమిటీల సమావేశంలో ఎమ్మెల్యే రాష్ట్ర గిరిజన సంక్షేమ కమిటీ అధ్యక్షురాలు మిరియాల శిరీష దేవి పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని గిరిజన సమాజానికి ఆర్థిక సామాజిక రాజకీయ సాధికారత కల్పించడం కమిటీ ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ పథకాల పర్యవేక్షణ, శాఖల నివేదికల సమీక్ష, ఫీల్డ్ విజిట్స్, భూమి హక్కుల పరిరక్షణ, విద్య–ఆరోగ్య సదుపాయాల బలోపేతం, ఉపాధి అవకాశాల పెంపు మరియు డిజిటల్ చేరువ వంటి అనేక కార్యక్రమాలను కమిటీ విజయవంతంగా అమలు చేస్తోందని వివరించారు.

## ఏజెన్సీ మండలాలను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలి

### -ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు సోడె



**కూనవరం, ఆగస్టు 30 (తెలుగురాష్ట్రం విలేఖరి):** ఆంధ్రప్రదేశ్ ఐదవ షెడ్యూలు భూభాగంలో ఉన్నటువంటి అల్లూరి సీతారామరాజు జిల్లాను రాజమండ్రి జిల్లాలో కలుపుటకు ప్రణాళిక వదంతులు వస్తున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాని జిల్లాను రాజమండ్రిలో జిల్లాలో కలిపే నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని అల్లూరి సీతారామరాజు జిల్లా ఆదివాసీ సంక్షేమ పరిషత్ 3898/90 జిల్లా అధ్యక్షులు సోడే మత్తయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ మండలాలను. పశ్చిమగోదావరి జిల్లాలో ఉన్న ఏజెన్సీ మండలాలను కలుపుతూ ఏజెన్సీను ఆదివాసి జిల్లాగా ప్రకటించాలని, 1947 స్వాతంత్రం వచ్చినప్పటినుండి ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసులు కొరకు రాజ్యాంగబద్ధంగా పలు రకాల అవకాశాలు, రాజ్యాంగంలో ఐదవ షెడ్యూల్ తెగలకు ఎస్టీలకు సంబంధించిన ముఖ్యమైన ఆర్టికల్స్ ఉన్నాయని, ఆర్టికల్ 46 ప్రకారం ఆదివాసులకు విద్య ఆర్థిక ప్రయోజనాలు ప్రోత్సహించాలని రాష్ట్రానికి నిర్దేశిస్తుందని అదేవిధంగా ఆర్టికల్ 335 ప్రభుత్వ సేవలో ఎస్సీ, ఎస్టీ,ల అవసరాలను పరిగిణంలోనికి తీసుకోవాలని చూసిస్తుందని అవి ఏమీ జరగటం లేదని మత్తయ్య తెలిపారు. ఆర్టికల్16(4ఏ) ప్రకారం పదోన్నత్తులు రిజర్వేషన్లు ఎస్టీల కు కల్పించాలని,ఏజెన్సీ ప్రాంతాలను, మైదాన ప్రాంతం, రాజమండ్రిలో కలపొద్దని, కలిపితే, కలుపుట వలన తీరని నష్టం జరుగుతుందని మాకు రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక చట్టాలు అమలు జరగటం లేదు. కనుక ఐదవ షెడ్యూల్ భూభాగంలోని వన్ బై 70 చట్టాన్ని, పేసా చట్టం, అడవి హక్కుల చట్టం, మొదలైనవి అవేవి అమలు కావటం లేదు. అదేవిధంగా ఆదివాసి ఏజెన్సీ మండలాలను విడదీస్తే ఐదవ షెడ్యూల ప్రాంతంలోని ఆదివాసుల యొక్క చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, అతీనమైన పవిత్రమైన, ఉన్నతమైనవి, అవి ఏవి నాశనం కాకుండా రక్షించే విధంగా ప్రభుత్వ నిర్ణయాలు ఉండాలన్నారు. ఆదివాసులు, విద్య అభివృద్ధి, విద్యావంతులు కాలేకపోయారని కావున రంపచోడవరం డివిజన్లో ఉన్న మండలాలు, చింతూరు డివిజన్లో ఉన్న మండలాలు, పశ్చిమగోదావరి జిల్లాలో ఉన్న మండలాలను, కలుపుతూ, ఆదివాసులకు ఏజెన్సీ ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలని, ప్రభుత్వానికి తెలియజేశారు. అలాగే ఐదవ షెడ్యూల్ భూభాగంలోని ఆదివాసులకు, పంచాయతీల నిబంధనలు షెడ్యూల్ ప్రాంతాలకు విస్తరణ చట్టం. 1996 పేసా చట్టం అమల్లోకి వచ్చింది. ఆదివాసి వర్గాలకు స్వయం పాలనను అందించడానికి భారత ప్రభుత్వం విస్తరించిన రూపొందించిన చట్టం పీసా చట్టం, ఆదివాసి సంప్రదాయ గ్రామ సభకు సహజ వనరులు సంస్కృతిక వివాద పరిష్కారం పై ఇస్తుంది. ఆదివాసి మండలంలో ఉన్న సచివాలయం పరిధిలో తీసుకొని పిసా చట్టం ప్రతి పంచాయతీ ద్వారా గ్రామ తీర్మానాలు చేసి , పిసా తీర్మానం చేసి పిసా ఉపాధ్యక్షులు కార్యదర్శిలు, పీసా గ్రామ సభలో ఆదివాసులకు ప్రత్యేక జిల్లా కావాలని తీర్మానం చేయాలని అన్ని ఆదివాసి మండలాల నుంచి పీసా గ్రామ సభలు జరిపించి తీర్మానాన్ని ప్రభుత్వానికి డిమాండ్ చేద్దామన్నారు.

## ఘనంగా ప్రారంభమైన అస్మిత యోగాసన మహిళా విభాగం పోటీలు




**తాడేపల్లిగూడెం, ఆగస్టు30 (తెలుగురాష్ట్రం విలేఖరి):** అస్మిత యోగాసన ఉమెన్ సిటీ లీగ్ 2025 26 పోటీలు పట్టణం లోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలను యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారు, యోగాసన భారత్ వారి ఆధ్వర్యంలో నిర్వహించినారు. ఈ పోటీల్లో 18 ఏళ్ల లోపు మహిళలు ఇండివిడ్చుల్ ఫార్వర్డ్ బెండింగ్, 18 ఏళ్ల పైబడిన మహిళలు ఫార్వర్డ్ బెండింగ్ అనే రెండు విభాగాలలో 250 మంది స్త్రీలు ఈ పోటీల్లో పాల్గొనడం జరిగినది. ఈ పోటీలను శ్రీ వాసవి జిఎంఆర్ జూనియర్ మరియు డిగ్రీ బి.ఎడ్ కాలేజీ వారు వెన్యూ పార్ట్నర్ గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా యోగాసన స్పోర్ట్స్ అథారిటీస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ అయిన శ్రీమతి ఏ రాధిక మాట్లాడుతూ ఈ పోటీలు ఇక్కడ అరా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రామకృష్ణ చే నిర్వహించడం మాకు చాలా ఆనందదాయకం అన్నారు. యోగ అనేది ఒక అందమైన శిల్పి ఒక శిల్పాన్ని తన చేతితో ఎలా అందంగా రూపుదిద్దుతాడో అలానే యోగాసనాలు ద్వారా మన ఫిజికల్ ఫిట్నెస్ ని అంత అందంగా మార్చుకోవచ్చని ఆడవాళ్లు అన్ని రంగాల్లో ముందుకు దూసుకు వెళుతున్నారు. యోగాలో కూడా మహిళలు మరింత ముందుకు దూసుకు వెళ్లి తమ ఆరోగ్యాన్ని తద్వారా కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మాట్లాడారు. సిటి లీగ్ కో ఆర్డినేటర్ రామకృష్ణ మాట్లాడుతూ ఈ అవకాశం మన తాడేపల్లిగూడెం రావడం మన అదృష్టమని యోగాసనాలు డైలీ చేస్తే లక్షల సంపాదించినట్లేనని ఎందుకంటే లక్షల కన్నా విలువైన ఆరోగ్యాన్ని యోగ ద్వారా మన సొంతం చేసుకోవచ్చని కావున ప్రతి ఒక్కరూ కూడా యోగాలో పాలుపంచుకోవాలని సూచించినారు. ఈ కార్యక్రమంలో జిఎంఆర్ విద్యా సంస్థల అధినేత లక్ష్మీనారాయణ, కాంపిటీషన్ డైరెక్టర్ సిహెచ్ సుధా దేవి , లీగ్ మేనేజర్ సిహెచ్ అంబిక, వైఎస్ఏఏపి వెస్ట్ గోదావరి ప్రెసిడెంట్ మాధవరావు, లీగ్ నోడల్ ఆఫీసర్ టి ఉషారాణి, అరా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## పింఛన్లు తొలగింపు అవాస్తవం

### -ఎమ్మెల్యే సురేంద్ర బాబు



**కళ్యాణదుర్గం, ఆగస్టు 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** నియోజకవర్గంలో దివ్యాంగ పింఛన్లు అందుకుంటున్న వారికి ముఖ్య విజ్ఞప్తి. గత 15రోజులుగా దివ్యాంగ పింఛన్లు రద్దు చేశారంటూ జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదు. దివ్యాంగుల పింఛన్లు అందుకుంటున్న వారికి రాష్ట్ర వ్యాప్తంగా పునఃపరిశీలన కోసం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 40శాతం కంటే తక్కువగా ఉన్న వారికి నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. వీరు అప్పీలు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఇప్పటికే చాలా మంది మున్సిపాలిటీ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాల్లో అప్పీలు చేసుకున్నారు. వీరందరికీ సెప్టెంబర్ 1వ తేదిన యధావిధిగా పింఛన్లు అందుతాయని ఎవరైతే అప్పీలు చేసుకుంటారో వారికి 1వ తేది యాధావిధిగా పింఛన్లు అందుతాయని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## వరద బాధిత కుటుంబాలకు నిత్యవసర సరుకులు అందించాలి

### సిపిఎం నేతలు విజ్ఞప్తి



**చింతూరు, ఆగస్టు30 (తెలుగురాష్ట్రం విలేకరి):** గత ఐదు రోజులుగా వరదలు రావడంతో వరదల్లో చిక్కుకున్న కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి సిపిఎం పార్టీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. తక్షణమే నిత్యవసరాలు అందించాలని, దోమలు బెడదతో జ్వరాలు ఎక్కువవుతున్న సందర్భంగా ప్రతి కుటుంబానికి దోమతెరలు పంపిణీ చేయాలని, ఏజీ కోడేరు కేంద్రంలో బోటు ఏర్పాటు చేయాలని సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కి వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ వరదల వలన ఏజీ కోడేరు, ముకునూరు, కల్లేరు, పీఎస్ పల్లి, రామన్నపాలెం గ్రామపంచాయతీల గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయని, నిత్యవసరాలు కొనుక్కునే అవకాశం లేకుండా వరదలు వచ్చాయని దానితో 15 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గోదావరికి వరద పెరుగుతుండడంతో రహదారులు ఇప్పట్లో వరద నుండి బయట పడే అవకాశం లేనందున ఈ 15 గ్రామాలకు కనీస అవసరాలు అయినా నిత్యవసరాలు అందించాలని అన్నారు. గత రెండేళ్లుగా దోమతెరలు పంపిణీ లేదని ఇప్పటికైనా ప్రభుత్వం జ్వరాల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని మండలంలో ఉన్న ప్రతి కుటుంబానికి దోమతెరలు పంపిణీ చేయాలని అన్నారు. ప్రతి గ్రామంలో స్ప్రేయింగ్ చేయించాలని,ఏజీ కోడేరు కేంద్రంగా ఆ మూడు గ్రామాల సౌకర్యార్థం ఒక బోటు ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్ కి అందించారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ కేజీ కోడేరు లో నిత్యవసరాలు అందిస్తామని మిగతా గ్రామాలకు కూడా కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని, దోమతెరల పంపిణీకి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిసం సురేష్,పొడియం లక్ష్మణ్, మొట్టమ్ రాజయ్య, కారం నాగేశ్వరరావు, కూర లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విజయవంతం

### ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, ఆగస్ట్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** కూటమి అధికారంలోకి రావడంతోనే మహిళలకు అన్ని విధాల వెలుగులు తెచ్చిందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. స్త్రీ శక్తి పథకంలో భాగమైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విజయవంతంమైన నేపథ్యంలో రాజమండ్రి పార్లమెంట్ మహిళ కమిటీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి ఆధ్వర్యంలో నగర మహిళ కమిటీ అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ పర్యవేక్షణలో రాజమండ్రి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి చిత్రపటానికి సుమారు వెయ్యి మంది మహిళలతో పాలాభిషేకం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. పాలాభిషేకం అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో మహిళల అభివృద్ధికి మంచి అవకాశాలు వస్తున్నాయన్నారు. ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు బాగా ఉపయోగపడుతోందన్నారు. మహిళల అభివృద్ధి ముఖ్యమని చంద్రబాబు నాయుడ నమ్మారు కాబట్టే గతంలో డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేశారని, కట్టెల పొయ్యి వద్ద ఇబ్బందిపడకూడదనే దీపం పథకాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఆనాడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాటిన డ్వాక్రా విత్తనం ఇప్పుడు మహా వృక్షమైందన్నారు. అన్ని రంగాల్లో మహిళలకు పురుషులతో సమానంగా ఉండాలన్నదే చంద్రబాబు నాయుడు ధ్యేయమని, కొన్ని రంగాల్లో అది కూడా జరుగుతోందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత మహిళల కోసం నిర్వహించిన మీ భద్రత %-% మా బాధ్యత కార్యక్రమానికి విశేష స్పందన వచ్చిందన్నారు. మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి వారి సమస్యలను చెప్పారని, ఆయా స్టేషన్ల పరిధిలో వారి సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. ముఖ్యంగా నగరంలో అల్లరి మూకలపై చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్‌లకు చాలా వరకూ కళ్లెం వేయడం జరిగిందన్నారు. మహిళల రక్షణే తమకు ముఖ్యమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను దాదాపుగా అమలు చేయడం జరుగుతోందన్నారు. త్వరలోనే అర్హులైన పేద మహిళలకు రెండు సెంట్ల భూమిని ఇవ్వడం జరుగుతుందన్నారు. చంద్రబాబు నాయుడు చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న సమయంలో మహిళలు, నాయకులు అంతా కలిసి "సూపర్ సిక్స్ %-% సూపర్ హిట్" అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అప్పారావు, ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, నాయకులు కాశీ నవీన్ కుమార్, మజ్జి రాంబాబు, దొండపాటి సత్యంబాబు, ఉప్పులూరి జానకీ రామయ్య, కిలపర్తి శ్రీను, కొల్లు బుజ్జి, కంటిపూడి రాజేంద్రప్రసాద్, కొయ్యల రమణ, కప్పల వెలుగు కుమారి, బోను ఈశ్వరి, మీసాల నాగమణి, కేలం శ్రీను, సలాది ఆనంద్, అధిక సంఖ్యలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక
SPORTS NEWS
https://epaper.teluguraastram.com
అమలాపురం
ఆగస్టు 31,
ఆదివారం 2025


# హెడ్ కోచ్ పదవికి రాహుల్ ద్రవిడ్ రాజీనామా!

## ఆ టీమ్‌కు ఊహించని షాక్..

**రాజస్థాన్ రాయల్స్ జట్టు ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ తన పదవికి రాజీనామా చేశారు. ఐపీఎల్ 2025 సీజన్ ముందు రెండేళ్ల ఒప్పందంపై నియమితులైన ద్రవిడ్, తదుపరి సీజన్‌లో కోచ్‌గా కొనసాగకూడదని నిర్ణయించుకున్నారు. రాయల్స్ ఫ్రాంచైజీ ఆయన సేవలకు కృతజ్ఞతలు తెలిపింది.**

రాజస్థాన్ రాయల్స్ జట్టు ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ రాజీనామా చేశారు. ఈ విషయాన్ని ఆర్‌ఆర్ మేనేజ్‌మెంట్ ధృవీకరించింది. ఐపీఎల్ 2025 సీజన్ కంటే ముందు రెండేళ్ల కాల పరిమితితో హెడ్ కోచ్ బాధ్యతలు చేపట్టిన ద్రవిడ్ అకస్మాత్తుగా ఆ పదవి నుంచి తప్పుకున్నారు. ఫ్రాంచైజీ నుండి వచ్చిన ఒక ప్రకటన ప్రకారం.. సెప్టెంబర్ 6, 2024న రెండేళ్ల ఒప్పందంపై నియమించబడిన 52 ఏళ్ల



లెజెండ్ ఇటీవలె జరిగిన చర్చలో వచ్చే సీజన్‌లో హెడ్ కోచ్‌గా కొనసాగేందుకు నిరాకరించినట్లు తెలుస్తోంది.

"రాయల్స్ జట్టు ప్రయాణంలో రాహుల్ చాలా సంవత్సరాలుగా కీలక పాత్ర పోషించారు. ఆయన నాయకత్వం ఒక తరం ఆటగాళ్లను ప్రభావితం చేసింది, జట్టులో బలమైన విలువలను నిర్మించింది. ఫ్రాంచైజీ సంస్కృతిపై చెరగని ముద్ర వేసింది" అని ఆర్‌ఆర్ ఫ్రాంచేజ్ పేర్కొంది. "ఫ్రాంచైజ్ నిర్మాణ సమీక్షలో భాగంగా రాహుల్‌కు ఫ్రాంచైజీలో విస్తృత స్థానం ఆఫర్ చేయబడింది, కానీ దానిని ద్రవిడ్ సున్నితంగా తిరస్కరించారు. రాజస్థాన్ రాయల్స్ దాని ఆటగాళ్ళు, ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది అభిమానులు రాహుల్ ఫ్రాంచైజీకి చేసిన అద్భుతమైన సేవకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు." అని పేర్కొంది.

కాగా రాహుల్ ద్రవిడ్ గతంలో 2011, 2015 మధ్య ఆటగాడిగా, కోచ్‌గా రాయల్స్‌కు మూలస్తంభంగా ఉన్నాడు, గత ఏడాది టీమిండియా T20 ప్రపంచ కప్ గెలిచిన తర్వాత ద్రవిడ్ ఆర్‌ఆర్ హెడ్ కోచ్‌గా వచ్చారు. అయితే ఐపీఎల్ 2025 రాయల్స్ జట్టు తీవ్రంగా నిరాశపరిచింది. 14 మ్యాచ్‌ల్లో కేవలం నాలుగు విజయాలతో తొమ్మిదవ స్థానంలో నిలిచింది.

## క్రికెట్ చరిత్రలోనే ఇది ఫస్ట్ టైం.. మ్యాచ్ ముందు షాకింగ్ ఘటన..

# పిచ్‌కి నిప్పంటించిన గ్రౌండ్ సిబ్బంది

**కెనడాలోని కింగ్ సిటీలో ఉన్న మాపుల్ లీఫ్ నార్త్-వెస్ట్ గ్రౌండ్‌లో క్రికెట్ వరల్డ్ కప్ లీగ్ 2లో భాగంగా నమీబియా, స్కాట్లాండ్ మధ్య జరగాల్సిన మ్యాచ్‌కు ముందు మైదాన సిబ్బంది విచిత్రంగా ప్రవర్తించారు. వర్షం ఆగిన తర్వాత గ్రౌండ్ సిబ్బంది పిచ్‌పై నిప్పులు పెట్టడం సోషల్ మీడియాలో వైరల్ అయింది.**

కెనడాలోని కింగ్ సిటీలో జరిగిన ఐసీసీ వరల్డ్ కప్ లీగ్ 2 మ్యాచ్‌లో నమీబియా, స్కాట్లాండ్ జట్ల మధ్య వింత ఘటన జరిగింది. వర్షం తర్వాత గ్రౌండ్ సిబ్బంది పిచ్‌పై నిప్పు పెట్టారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ కారణంగా మ్యాచ్ రద్దయింది.

### పిచ్‌పై నిప్పు

భారీ వర్షాల కారణంగా మ్యాచ్ ప్రారంభం ఆలస్యమైంది. చాలాసార్లు పిచ్‌ను పరిశీలించిన తర్వాత కూడా, అది ఆటకు అనుకూలంగా లేదని గుర్తించారు. కొద్దిసేపటి తర్వాత గ్రౌండ్ సిబ్బంది పిచ్‌ను త్వరగా ఆరిపోయేలా చేయడానికి దానిపై నిప్పు అంటించారు. దీనిని చూసి ఆటగాళ్లు కూడా ఆశ్చర్యపోయారు. ఈ వింత పద్ధతితో కూడా పిచ్ సిద్ధం కాకపోవడంతో మ్యాచ్ రద్దయింది. స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 9:02 గంటల వరకు మ్యాచ్ ప్రారంభం కావాల్సి ఉంది, కానీ అది



సాధ్యం కాలేదు.

### గత మ్యాచ్‌లలో జట్ల ప్రదర్శన

ఈ మ్యాచ్‌కు ముందు నమీబియా, స్కాట్లాండ్ జట్ల ప్రదర్శనలు విరుద్ధంగా ఉన్నాయి. నమీబియా కెనడాను ఐదు వికెట్ల తేడాతో ఓడించింది. మరోవైపు, స్కాట్లాండ్ 369 పరుగులు చేసినప్పటికీ, నెదర్లాండ్స్ జట్టు నాలుగు వికెట్ల తేడాతో గెలిచింది. డచ్ జట్టు నాలుగు బంతులు మిగిలి ఉండగానే ఈ భారీ లక్ష్యాన్ని ఛేదించింది.

### వరల్డ్ కప్ క్వాలిఫికేషన్

నమీబియా, స్కాట్లాండ్ జట్లు వరుసగా సెప్టెంబర్ 2, ఆగస్టు 30న కెనడాతో తలపడనున్నాయి. నమీబియా 2027 వరల్డ్ కప్‌ను దక్షిణాఫ్రికా, జింబాబ్వేతో కలిసి నిర్వహించనుంది. అయితే, నమీబియాకు వరల్డ్ కప్‌లో ఆడేందుకు హామీ లేదు. ఎందుకంటే వారు పూర్తి ఐసీసీ సభ్యులు కాదు, కాబట్టి వారు అర్హత ప్రక్రియ ద్వారానే వరల్డ్ కప్‌లోకి రావాలి.

నమీబియా చివరిసారిగా 50 ఓవర్ల వరల్డ్ కప్‌లో 2003లో ఆడింది. స్కాట్లాండ్ కూడా ఈసారి టోర్నమెంట్‌లో తమ ప్రదర్శనను నిరూపించుకోవాలని కోరుకుంటోంది. ఆ జట్టు చివరిసారిగా 2015లో 50 ఓవర్ల వరల్డ్ కప్‌లో ఆడింది.

# ఒక్కొక్కరికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా : ఆర్సీబీ




బెంగళూరు : ఆర్సీబీ విజయోత్సవాల వేళ %ా% బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11 మంది ప్రాణాలను కోల్పోయిన సంగతి తెలిసిందే. అయితే ఇటీవలే బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు యాజమాన్యం.. ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసింది. తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియాను ప్రకటించింది. " జూన్ 4, 2025న మా హృదయాలు ముక్కలయ్యాయి. ఆ రోజు ఆర్సీబీ కుటుంబంలోని పదకొండు మంది సభ్యులను మేము కోల్పోయాము. వారంతా మాలో భాగమే. మా జట్టును ప్రత్యేకంగా తీర్చిదిద్దడంలో వారిది కీలక పాత్ర. వారు లేని లోటు పూడ్చలేనిది. ప్రతీ ఒక్కరిలోనూ వారి జ్ఞాపకాలను చూసుకుంటాము. కానీ మా మొదటి అడుగుగా వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 25 లక్షలు నష్టపరిహారంగా ఇచ్చాము. కేవలం ఒక్క ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా భవిష్యత్తులో వారికి అన్ని విధాలగా సపోర్ట్‌గా ఉంటాము. అందుకోసం 'ఆర్సీబీ కేర్స్' పని చేస్తుంది " అని ఆర్సీబీ ఓ ప్రకటనలో పేర్కొంది.

### అసలేం జరిగిందంటే ..

%అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఫైనల్లో పంజాబ్ కింగ్స్‌ను ఓడించిన ఆర్సీబీ.. పదిహేడేళ్ల తర్వాత తొలి ఐపిఎల్ టైటిల్‌ను గెలుచుకుంది. దీంతో బెంగళూరు అభిమానుల సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ క్రమంలో ఆర్సీబీ ఫ్రాంచైజీ సైతం విజయయాత్రను ఘనంగా చేసుకోవాలని భావించింది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో విజయోత్సవ వేడుకలను నిర్వహించాలని ఆర్సీబీ ప్లాన్ చేసింది. అయితే అందుకు తగ్గ ఏర్పాట్లు చేయకపోవడంతో తీరని విషాదం నెలకొంది. భారీ సంఖ్యలో అభిమానులు తరలిరావడంతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో మొత్తం 11 మంది ప్రాణాలను కోల్పోయారు. 50 మందికిపైగా గాయాలపాలయ్యారు. దీంతో ఆర్సీబీ యాజమాన్యంపై కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనకు బాధ్యులుగా ఆర్సీబీ మార్కెటింగ్ హెడ్ నిఖిల్ సోసాలే, డీఎన్ఎ ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ముగ్గురు సిబ్బందిని పోలీసులు అరెస్టు చేశారు.

# W,W,W,W,W,W,W

## క్రికెట్ హిస్టరీలోనే చెత్త రికార్డ్..

### ఈ మరక అస్సలు మంచిది కాదు భయ్యో



**ఈ చెత్త రికార్డు టీ20 క్రికెట్‌లో ఉంది. ఇందులో ఒకే ఇన్నింగ్స్‌లో ఏడుగురు బ్యాటర్స్ రనౌట్ అయ్యారు. టీ20 చరిత్రలో ఇంతకు ముందు ఎప్పుడూ ఒకే ఇన్నింగ్స్‌లో ఇంత మంది బ్యాట్స్‌మెన్స్ రనౌట్ కాలేదు. ఇప్పుడు ఈ రికార్డును బద్దలు కొట్టడం లేదా రువాండా జట్టు నుంచి ఈ మరకను తొలగించడం అసాధ్యం అనిపిస్తుంది.**

క్రికెట్ ఆటలో ప్రతిభ మాత్రమే కాదు, అదృష్టం కూడా కీలక పాత్ర పోషిస్తుంది. రనౌట్, 90ల్లో ఔట్ అవ్వడం వంటివి దురదృష్టం వల్లే వస్తాయి. మొత్తం జట్టుకే బ్యాడ్‌లక్‌గా మారిన ఒక రికార్డు గురించి ఇప్పుడు తెలుసుకుందాం. ఆ జట్టు పేక ముక్కలా కూలిపోయింది. ఆసక్తికరంగా, ఒకరు, ఇద్దరు లేదా ముగ్గురు కాదు, జట్టులోని ఏడుగురు బ్యాటర్ల దురదృష్టం కారణంగా రనౌట్‌కు గురయ్యారు.

### అత్యధిక రనౌట్లు..

ఈ చెత్త రికార్డు టీ20 క్రికెట్‌లో ఉంది. ఇందులో ఒకే ఇన్నింగ్స్‌లో ఏడుగురు బ్యాటర్స్ రనౌట్ అయ్యారు. టీ20 చరిత్రలో ఇంతకు ముందు ఎప్పుడూ ఒకే ఇన్నింగ్స్‌లో ఇంత మంది బ్యాట్స్‌మెన్స్ రనౌట్ కాలేదు. ఇప్పుడు ఈ రికార్డును బద్దలు కొట్టడం లేదా రువాండా జట్టు నుంచి ఈ మరకను తొలగించడం అసాధ్యం అనిపిస్తుంది. ఈ చెత్త రికార్డు 2022 సంవత్సరంలో రువాండా, మలావి జట్లు ఒకదానితో ఒకటి తలపడిన సమయంలో ఇది చోటు చేసుకుంది.

### 7 రనౌట్లు ఎలా జరిగాయంటే?

రువాండా జట్టు మొదట బ్యాటింగ్‌కు దిగింది. ఈ సమయంలో జట్టులోని ఓపెనింగ్ బ్యాటర్స్ రనౌట్ అయ్యాడు. ఆ తర్వాత, రనౌట్ల పరంపర ఆగలేదు. బ్యాటర్స్ నిరంతరం రనౌట్ అవుతూనే ఉన్నారు. 10వ నంబర్ బ్యాటర్ కూడా రనౌట్ అయ్యాడు. ఈ మ్యాచ్ ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక రనౌట్లు సాధించిన వారి జాబితాలో సిగ్గుచేటు రికార్డు నమోదైంది.

# 8 ఫోర్లు, 15 సిక్సులు.. 42 బంతుల్లో సెంచరీ..

## కట్‌చేస్తే.. సిగ్నేచర్ బౌలర్‌కి ఇచ్చిపడేశాడుగా

**ఢిల్లీ ప్రీమియర్ లీగ్ 2025 ఎలిమినేటర్ మ్యాచ్‌లో వెస్ట్ ఢిల్లీ లయన్స్ కెప్టెన్ నితీష్ రాణా బ్యాట్ ఫుల్ స్వింగ్‌లో ఉంది. అతను సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్స్‌పై కేవలం 42 బంతుల్లో సెంచరీ చేసి తన జట్టును ఈ లీగ్‌లో క్వాలిఫైయర్-2కి తీసుకెళ్లాడు. ఈ సమయంలో, అతను 15 సిక్సర్లు కొట్టాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడిన నితీష్ రాణా, మ్యాచ్ సమయంలో ఏ బౌలర్‌ను కూడా వదిలిపెట్టలేదు. అందరిని దారుణంగా బాదేశాడు. ఈ క్రమంలో సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్ స్పిన్నర్ దిగ్వేష్ రాఠితో కూడా గొడవకు దిగాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది.**



### నితీష్ రాణా తుఫాన్ ఇన్నింగ్స్..

ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్ట్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 201 పరుగులు చేసింది. దీనికి సమాధానంగా, వెస్ట్ ఢిల్లీ లయన్స్ 17 బంతులు మిగిలి ఉండగానే ఏడు వికెట్ల తేడాతో మ్యాచ్‌ను గెలుచుకుంది. వెస్ట్ ఢిల్లీ కెప్టెన్ నితీష్ రాణా కేవలం 42 బంతుల్లోనే సెంచరీ సాధించడం ద్వారా ఈ మ్యాచ్‌ను పూర్తిగా ఏకపక్షంగా మార్చాడు. అతను 55 బంతుల్లో 8 ఫోర్లు, 15 సిక్సర్లతో అజేయంగా 134 పరుగులు చేశాడు.

ఈ సమయంలో, అతను దక్షిణ ఢిల్లీ బౌలర్లందరినీ చిత్తు చేశాడు. దిగ్వేష్ రతి వేసిన ఒక ఓవర్‌లో నితీష్ వరుసగా 3 సిక్సర్లు కొట్టాడు. ఈ ఓవర్‌లో దిగ్వేష్ రతి 20 పరుగులు ఇచ్చాడు. నితీష్ రాణాతో పాటు, వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ క్రిస్ యాదవ్ 22 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 31 పరుగులు చేశాడు. మయాంక్ గోసైన్ 15 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. దక్షిణ ఢిల్లీ తరపున సుమిత్ కుమార్ బెనివాల్ రెండు వికెట్లు పడగొట్టాడు. అమన్ భారతికి ఒక వికెట్ దక్కింది. దీనికి ముందు, దక్షిణ ఢిల్లీ బ్యాట్స్‌మెన్ అద్భుతంగా బ్యాటింగ్ చేశారు.

### సౌత్ ఢిల్లీ కెప్టెన్ హాఫ్ సెంచరీ..

వెస్ట్ ఢిల్లీ లయన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్స్ జట్టుకు మంచి ఆరంభం లభించింది. ఓపెనర్లు అంకుర్ కౌశిక్ (16), అన్మోల్ శర్మ జట్టుకు మంచి ఆరంభం ఇచ్చారు. ఈ ఇద్దరు బ్యాటర్స్ కలిసి తొలి వికెట్‌కు 44 బంతుల్లో 67 పరుగులు చేశారు. ఆ తర్వాత అంకుర్ కౌశిక్ పెవిలియన్‌కు తిరిగి వచ్చాడు. 76 పరుగుల వద్ద కున్వర్ బిధురి రూపంలో జట్టుకు మరో దెబ్బ తగిలింది. అతను కేవలం 6 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఆ తర్వాత అన్మోల్ శర్మ కూడా ఔటయ్యాడు. అన్మోల్ 39 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 55 పరుగులు చేశాడు.

కెప్టెన్ తేజస్వి దహియా, సుమిత్ మాథుర్ వేగంగా పరుగులు చేయడం ప్రారంభించి జట్టును భారీ స్కోరుకు తీసుకెళ్లారు. తేజస్వి దహియా 33 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్సర్లతో 60 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. సుమిత్ మాథుర్ 26 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 48 పరుగుల అజేయంగా నిలిచాడు. వీరి అద్భుతమైన బ్యాటింగ్ సహాయంతో, సౌత్ ఢిల్లీ 20 ఓవర్లలో 5 వికెట్లకు 201 పరుగులు చేసింది. వెస్ట్ ఢిల్లీ లయన్స్ తరపున హృతిక్ షోకిన్ రెండు వికెట్లు పడగొట్టాడు. శుభమ్ దుబే, శివంక్ వశిష్ట్, అనిరుధ్ చౌదరి తలా ఒక వికెట్ తీసుకున్నారు. వెస్ట్ ఢిల్లీ లయన్స్ బ్యాటింగ్ సమయంలో నితీష్ రాణా, దిగ్వేష్ రాఠి గొడవకు దిగారు. నితీష్ రాణా, దిగ్వేష్ రాఠి మైదానంలో ఘర్షణ పడినపుడు వెస్ట్ ఢిల్లీ లయన్స్ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ నితీష్ రాణా వేగంగా పరుగులు చేస్తున్నాడు. సౌత్ ఢిల్లీ స్పిన్నర్ దిగ్వేష్ రాఠీపై అతను వేగంగా పరుగులు సాధించాడు. ఈ సమయంలో అతను తన ఓవర్లలో ఒకదానిలో వరుసగా 3 సిక్సర్లు కొట్టాడు. ఇది దిగ్వేష్ రాఠీని కోపంగా మార్చింది. ఈ సమయంలో, దిగ్వేష్ రాఠీ బౌలింగ్ చేయడానికి వచ్చాడు. నితీష్ రాణా స్ట్రైక్‌లో ఉన్నాడు. దిగ్వేష్ బౌలింగ్ చేయడానికి వెళ్ళాడు. కానీ, అతను బంతిని వదలలేదు. ఈ బంతిపై నితీష్ స్వీప్ షాట్ ఆడాలనుకున్నాడు. దిగ్వేష్ తదుపరి బంతిని వేయబోతుండగా, నితీష్ వెనక్కి తగ్గాడు. ఆ తర్వాత, ఇద్దరి మధ్య వాదన మొదలైంది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇద్దరి మధ్య చాలా సేపు వాదన జరిగింది. ఈ సమయంలో నితీష్ దిగ్వేష్‌కు బ్యాట్ కూడా చూపించాడు. అంపైర్, ఆటగాళ్ళు జోక్యం చేసుకుని విషయాన్ని శాంతింపజేశారు. ఈ మ్యాచ్‌లో దిగ్వేష్ రాఠి చాలా ఖరీదైనదిగా నిరూపితమైంది.

తెలుగురాష్ట్రం దినపత్రిక



# హీరోయిన్ల పోస్టర్లు ఎందుకు పెట్టరు?

'దక్షిణాది సినిమా పోస్టర్‌లలో హీరోలే ఉంటారు కానీ హీరోయిన్‌లు కనిపించర'ని ఓ కార్యక్రమంలో జ్యోతిక మాట్లాడారు. ఒక సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొన్న ఆమె, 'బాలీవుడ్ నటుడు అజయ్ దేవగన్, మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి తమ సినిమాలకు సంబంధించిన పోస్టర్లలో తన ఫోటోను ఉంచారని, కానీ దక్షిణాదిలో మాత్రం హీరోయిన్‌ల ఫోటోలను పోస్టర్లపై పెట్టడానికి ఆసక్తి చూపర'ని అన్నారు. తాను నటించిన 'శైతాన్' హిందీ సినిమా పోస్టర్‌ను అజయ్ దేవగన్ తన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారని, అలాగే మలయాళంలో మమ్ముట్టితో నటించిన 'కాథల్–ది కోర్' సినిమా పోస్టర్‌ను కూడా మమ్ముట్టి తన సోషల్ మీడియాలో పంచుకున్నారని జ్యోతిక గుర్తు చేశారు. దక్షిణాదిలో ఎంతోమంది స్టార్ హీరోలతో తాను పనిచేశానని ఏ ఒక్కరూ తమ సోషల్ మీడియాలో హీరోయిన్ల ఫోటోలను పోస్ట్ చేయడానికి ఆసక్తి చూపలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

# 'ఘాటీ' సెన్సార్ పూర్తి



అనుష్క శెట్టి, దర్శకుడు క్రిష్ జాగర్లమూడి కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం ఘాటీ. భారీ అంచనాలతో సెప్టెంబర్ 5న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా సెన్సార్ పూర్తి చేసుకుంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ ఆకట్టుకుంటోంది. క్రైమ్ అండ్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రంలో అనుష్క వైవిధ్యమైన పాత్రలో నటించారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్మెంట్స్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మించాయి. ఈ చిత్రానికి యు/ఎ సర్టిఫికెట్‌ను సెన్సార్‌బోర్డ్ జారీ చేసింది. ఈ మూవీ 2.37 గంటల నిడివితో ఉంది. ఏడుకు పైగా భారీ యాక్షన్‌సీన్లలో అనుష్క బాగా నటించినట్లుగా సమాచారం.




# సరదాగా సాగే 'బూమ్ బూమ్..'


యంగ్ హీరో ప్రదీప్ రంగ నాథన్ పాన్ ఇండియా మూవీ డ్యూడ్‌తో అలరించడానికి సిద్ధమవుతున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంతో కీర్తిశ్వరన్ డైరెక్టర్ గా పరిచయం అవుతున్నారు. 'ప్రేమలు' అద్భుతమైన విజయం తర్వాత ప్రదీప్ సరసన మమిత బైజు నటించగా, శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ – బూమ్ బూమ్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ పాటని సాయి అభ్యాంకర్ స్వరపరిచి పాడారు. విజువల్స్, సరదాగా గడిపే ఫ్రెండ్స్ గ్యాంగ్, ప్రదీప్ , మమిత కెమిస్ట్రీ, స్టైలిష్ డ్యాన్స్ మూవ్‌లతో సాంగ్ చాలా ట్రెండీగా వుంది. ఈ దీపావళికి ఈ చిత్రం అక్టోబర్ 17న తెలుగు, తమిళం, హిందీ, మలయాళం , కన్నడ భాషలలో విడుదల కానుంది.

# 'రామాయణ' ఫస్ట్ పార్ట్ ముగింపు అక్కడే.. ఆ స్టార్ హీరో వాయిస్‌తో

భారత సినీ చరిత్రలో అత్యంత భారీ బడ్జెట్‌తో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న సినిమా 'రామాయణ'. అందరికీ తెలిసిన ఇతిహాసమే అయినా.. ఈ సినిమాను చూసేందుకు ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. రెండు భాగాలుగా ఈ సినిమా విడుదల కానుంది. మొదటి భాగం .. వచ్చే ఏడాది దీపావళి కానుకగా రానుంది. అయితే ఈ సినిమాను పరిచయం చేస్తూ.. కొద్ది రోజుల క్రితం చిత్ర యూనిట్ ఓ చిన్న వీడియోను విడుదల చేశారు. దీంతో సినిమాపై అంచనాలు మరోస్థాయికి వెళ్లిపోయాయి. అయితే ఈ సినిమాకు సంబంధించి లేటెస్ట్‌గా ఈ సినిమాకు సంబంధించి మరో ఆసక్తికర వార్త తెలిసింది. రాముడికి జటాయువు సీత జాడ గురించి ఇచ్చే సందేశంతో రామాయణ తొలి పార్ట్ ముగిస్తారట. 'రామాయణ మొదటి భాగం జటాయువు మరణంతో ముగుస్తుంది. జటాయువుకు అమితాబ్ బచ్చన్ వాయిస్ ఓవర్ ఇస్తారు. ఈ సన్నివేశంతో సీతాదేవిని ఎవరు అపహరించారో రాముడికి తెలుస్తుంది. అసలు యుద్ధం పార్ట్–2లో ఉంటుంది' అని చిత్ర యూనిట్ తెలిపింది. ఇక ఈ సినిమాలో రాముడిగా రణ్‌బీర్ కపూర్ నటిస్తుండగా.. సీత పాత్రలో సాయి పల్లవి నటిస్తోంది. రావణాసురిడి పాత్రలో కన్నడ స్టార్ యశ్ కనిపించనున్నారు. నితీశ్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాను నమిత్ మల్హోత్ర భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ



సినిమా తొలి భాగం 2026 దీపావళికి.. రెండో భాగం 2027 దీపావళికి విడుదల చేసేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది.



# అసభ్యంగా నడుమును తాకిన హీరో..

## ఇండస్ట్రీని వీడితున్నట్లు ప్రకటించిన హీరోయిన్ అంజలి..!

ఇటీవల భోజ్‌పురి హీరో పవన్ సింగ్ అసభ్యంగా ప్రవర్తిస్తూ హీరోయిన్ అంజలి రాఘవ్ నడుమును తాకిన విషయం తెలిసిందే. ఈ ఘటన సర్వత్రా విమర్శలకు దారి తీసింది. పలువురు హీరో తీరుపై మండిపడ్డారు. తాజాగా హీరోయిన్ అంజలి రాఘవ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల లక్నోలో జరిగిన ఒక పాట ప్రమోషన్ ఈవెంట్‌లో జరిగిన ఘటనతో మనస్తాపానికి గురైనట్లు తెలిపారు. 'సైయా సేవా కరే' పాట ప్రచార కార్యక్రమం సందర్భంగా వేదికపై మాట్లాడుతున్న అంజలి దగ్గరకు హీరో పవన్ సింగ్ వచ్చాడు. ఆమె అనుమతి లేకుండా ఆమె నడుమును తాకాడు. చీరపై ట్యాగ్ ఉందని, దాన్ని తీసేందుకు అలా చేశానని పవన్ చెప్పినట్లు వీడియోలో వినిపించింది. ఆ క్షణంలో అంజలి నవ్వినప్పటికీ, ఆమె ముఖంలో అసౌకర్యం స్పష్టంగా కనిపించింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అంజలి రెండు రోజుల తర్వాత ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందిస్తూ తన మనోవేదనను బయటపెట్టారు. 'నన్నే తప్పు పట్టి మీమ్స్ చేస్తున్నారు. బహిరంగంగా ఎవరో తాకితే దాన్ని ఎవరైనా ఆనందంగా స్వీకరిస్తారా? ఆ సమయంలో కొత్త చీర కావడంతో ట్యాగ్ ఉందేమోనని అనుకున్నాను. కానీ, ఆ తర్వాత ఏమీ లేదని తెలిసి కన్నీళ్లు ఆగలేదు. ఇదేందని నిలదీసేలోగానే పవన్ సింగ్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు' అంటూ చెప్పుకొచ్చింది. ఈ ఘటన తనపై తీవ్ర ప్రభావం చూపిందని, అందుకే భోజ్‌పురి సినిమా ఇండస్ట్రీని పూర్తిగా వదిలేయాలని నిర్ణయించుకున్నట్లు ఆమె స్పష్టంచేశారు. 'ఎవరి అనుమతి లేకుండా వారిని తాకడం ఎప్పటికీ సమంజసం కాదు. ఇకపై నా కుటుంబంతో కలిసి హర్యానాలోనే జీవిస్తాను' అంటూ అంజలి ప్రకటించారు. ఈ సంఘటనపై సోషల్ మీడియాలో పెద్ద చర్చ జరుగుతున్నది. చాలా మంది నెటిజన్లు అంజలి రాఘవ్‌కు మద్దతుగా నిలిచారు.


# అల్లు అర్జున్ నాన్నమ్మ కన్నుమూత



హైదరాబాద్: టాలీవుడ్ నటుడు అల్లు అర్జున్ ఇంటిలో విషాదం చోటుచేసుకుంది. నిర్మాత అల్లు అరవింద్ తల్లి, అల్లు అర్జున్, నాన్నమ్మ కనకరత్నమ్మ (94) కన్నుమూశారు. తన తల్లి వయోభారంతో గత అర్ధరాత్రి 1.45 గంటలకు తుదిశ్వాస విడిచారని అల్లు అరవింద్ తెలిపారు. మెగాస్టార్ చిరంజీవి అల్లు అరవింద్ నివాసానికి చేరుకున్నారు. తన అత్త మృతి పట్ల చిరంజీవి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె మృతితో చిరంజీవి, అల్లు అరవింద్ కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. టాలీవుడ్ ప్రముఖులు ఆమె మృతి పట్ల సంతాపం



తెలిపారు. శనివారం కోకాపేటలో అంత్యక్రియలు నిర్వహిస్తామని వివరించారు. మైసూర్ నుంచి రాంచరణ్, ముంబయి నుంచి అల్లు అర్జున్ కాసేపట్లో ఇంటికి చేరుకోనున్నారు. చిరంజీవి సోదరులు పవన్ కళ్యాణ్, నాగబాబు రేపు అల్లు కుటుంబాన్ని కలిసి సంతాపం తెలియజేస్తారు. అంత్యక్రియలకు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరవుతారని భావిస్తున్నారు. శ్రద్ధాంజలి ఘటించేందుకు అల్లు, మెగా అభిమానులు భారీగా అరవింద్ ఇంటికి చేరుకుంటున్నారు. అభిమానులను నియంత్రించేందుకు పోలీసులు అరవింద్ ఇంటి వద్ద భారీగా మోహరించారు. అల్లు రామలింగయ్య 2004 జులై 31 మృతి చెందారు. భర్త కన్నుమూసిన 21 సంవత్సరాల తరువాత భార్య కనకరత్నమ్మ చనిపోయారు.





# అత్తగారి పాడె మోసిన చిరంజీవి...

- అల్లు రామలింగయ్య సతీమణి కనకరత్నమ్మ కన్నుమూత
- పాడె మోసిన చిరంజీవి, అల్లు అర్జున్
- కోకాపేటలో జరుగుతున్న అంత్యక్రియలు



ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ ఇంట తీవ్ర విషాదం నెలకొంది. ఆయన మాతృమూర్తి, దివంగత నటుడు అల్లు రామలింగయ్య భార్య అల్లు కనకరత్నమ్మ (94) ఈ తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె, తన నివాసంలోనే కన్నుమూశారు. ఆమె అంత్యక్రియలు కోకాపేటలోని ఫామ్‌హౌస్‌లో జరుగనున్నాయి.

ఈ సందర్భంగా ఓ భావోద్వేగ దృశ్యం అందరినీ కదిలించింది. మెగాస్టార్ చిరంజీవి తన అత్తమ్మ కనకరత్నమ్మ పాడెను భుజాలపై మోశారు. అల్లు అర్జున్ తో కలిసి ఆయన కనకరత్నమ్మ పాడెను మోశారు. రామ్ చరణ్ కూడా అక్కడే ఉండి, అంత్యక్రియల ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఉదయమే అల్లు అరవింద్ ఇంటికి చేరుకున్న చిరంజీవి, రామ్ చరణ్ అల్లు కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## అమ్మమ్మని ఆఖరి చూపు చూసుకుంటున్న రామ్ చరణ్!



TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339